సందేహాలూ, ముఖ్య విషయాలు నోట్ చేసుకోటానికి

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N00021

12

V

VI

ఓం గీతామృత మహోదధయేనమః

# సూచన

(1) ఈ పుస్తకం అందించే విషయాలు మహా శ్రేయస్సును గలిగించేవి, అమూల్యాలు గనుక, దీనికి మేము మూల్యం నిర్ణయించ లేదు. సాధకులకు ఉచితంగానే ఇయ్యతలంచాము. నలుగురూ లాభం పొందటమే మా ఆశయం.

(2) ఉచితంగా లభిస్తున్నదని నిరాదరణ చేయకుండా, ఆమూలాగ్రము చదివి, అభ్యాసం మొదలు పెట్టడానికి పూనుకొని, మాకు తెలియజేస్తే అభ్యాస వివరాలు అందించి, దూరాన ఉన్న సాధకుల సందేహాలు ఉత్తరాల ద్వారా నివర్తించేందుకు ప్రయత్నం చేస్తాము.

(3) భక్తులూ, ఉదారులూ, కలిగి ఉన్నవారూ ఇంకను క్రమక్రమంగా రాబోవు ఇటువంటి ప్రచురణలకు తోడ్పడే తలంపుతో వారికి తోచింది క్రింద ఇచ్చిన అడ్రసుకు పంపితే కృతజ్ఞులమై ఉంటాము.

(4) ఈ పుస్తకాలను అటూ ఇటూ పోనీకుండా, జాగ్రత చేసి ఉంచుకుంటే, తరువాత విచ్చేవి దీనిని అనుసరించిన విషయాలను విశదపరచేవై యుంటవి గాన, అన్నిటిని ఒకే పుస్తకంగానో విడి విడి సంపుటాలుగానో తయారు చేసుకోటానికి వీలుగలుగుతుంది.

ఓం తత్సత్

శ్రీకృష్ణానందాశ్రమగీతా ప్రచార సంఘం

అడ్రసు:

SRI Y. SRIHARI SARMA
Andhra Bank, Central Office,
(Treasurer, S.K.G.P. Sangham)
HYDERABAD-1.

V113

ఓం గీతామృతమహోదధయేనమః

ఓం

కృష్ణానంద ముకుంద మురారే వామన మాధవ గోవింద
శ్రీధర కేశవ రాఘవ విష్ణో శ్రీనారాయణ చిద్రూప

# ని వే ద న

మూకంకరోతి వాచాలం పంగుం లంఘయతేగిరిం
యత్కృపాత మహంవందే పరమానంద మాధవం.

ఎవని కృప మూగవాడికి మాట్లాడే శక్తినీ కుంటి వాడికి కొండను దాటే శక్తినీ కలుగ జేస్తుందో అంటే మన చేతగాదు అని మనం నిరాశ చెందిన విషయాలు ఎవని దయవల్ల మనచేత అవుతవో

అట్టి పరమానంద స్వరూపుడైన పరమేశ్వరునకు నమస్కారము.

ప్రారబ్ధం భుజ్యమానోఽపి
గీతాభ్యాసరతస్సదా
సముక్తస్ససుఖీలోకే
కర్మణానో పలిప్యతే

ప్రారబ్ధాన్ని అనుభవిస్తున్న వాడైనా, నిరంతరంగా గీతను అభ్యసిస్తూ ఉంటే, కర్మఫలం వానిని బంధించదు. పరమ సుఖరూప ముక్తిని పొందుతాడు. అని భగవద్వాక్యం.

అధ్యేష్యతే చ య ఇమం
ధర్మ్యం సంవాద మావయోః
జ్ఞాన యజ్ఞేన తే నాహం
ఇష్టః స్యామితి మే మతిః

(గీ॥ 18 అ 70 శ్లో)

"ఎవరు ఈ గీతను అధ్యయనం చేస్తారో వారు అన్ని యజ్ఞాలలో శ్రేష్ఠమైన జ్ఞాన యజ్ఞం చేత నన్ను అర్చించిన వారు అవుతారు." అని గీత వాక్యం.

కొన్ని సంవత్సరాల నుంచి గీతాభ్యాసం చేస్తూన్న మాకు పై వాక్యాల అర్థం అనుభవంలోకి వస్తున్నది. గనుక మేము విశ్వాసంతో చేస్తూ ఉన్నదానినీ, పొందుతున్న శ్రేయస్సునూ, స్నేహిత బృందానికి తెలియజేసి వాళ్ళు గూడ ఈ మార్గంలోకి వచ్చేట్టు చేయటం మా ముఖ్య కర్తవ్యంగా తలుస్తున్నాము.

దాని కోసం హైదరాబాదు నగరంలో వివిధములైన కేంద్రాలలో (1) ధ్యానం (2) మానసిక అర్చనం (3) నామ సంకీర్తనం (4) గీతా మననం (5) గీతా ప్రవచన శ్రవణం అనే సాధన నిర్విరామంగా చేస్తూ భక్త సోదరులకు ఈ సాధనయందు అభిరుచి గలిగేట్టు చేస్తున్నాం. చాలమంది అభ్యాసానికి పూను కొన్నారు. పూనుకుంటు న్నారు. లాభం పొందుతున్నారు.

ఇక ఇతర నగరాలలోనూ గ్రామాలలోనూ, ఉండే స్నేహిత బృందానికి ఈ సాధన వివరాలు అందిస్తే వారుగూడా ఈ సాధన చేసి శ్రేయస్సును పొందుతారనే భావంతో

వివిధ శీర్షికల క్రింద, చిన్న చిన్న పుస్తకాల రూపంలో భగవద్గీతాతత్త్వాన్ని – ఉపనిషత్సారాన్ని అందజేసే అభిప్రాయంతో ఈ పుస్తకాలను ప్రచురించుతున్నాం.

ఈ పుస్తకాలలో వాడుక భాషనే ఉపయోగించదలచాం. వ్యాకరణానికీ, భాషా సౌందర్యానికీ, ప్రాధాన్యత ఇయ్యదలచుకోలేదు. నలుగురికీ సులభంగా విషయం అర్థంకావటమే మా ఆశయం. దీనికి వాడుక భాషే అనుకూలంగా ఉంటుందని నమ్ముతున్నాము.

కఠిన పదాలతోనూ, సంస్కృత సమాసాలతోనూ ఉన్న పుస్తకాలు చాలా ఉండనే ఉన్నవి. సామాన్య భాషా జ్ఞానంగల వారు ఈ లావు పుస్తకాలను చూచి అసలు దగ్గరకే పోరు. అథవా ఎవరైనా సాహసించి చేత్తో పట్టుకొని పట్టుదలతో, పఠిద్దామని గట్టిగా కూర్చుంటే, రెండు కాగితాలు చూచేటప్పటికి, అర్ధంకాక. ఆయాసంవచ్చి అవతల పడేసి, మళ్లీ వాటివంక తిరిగి చూడకుండా ఉండే పరిస్థితి గలుగుతూండటం చాల మందికి అనుభవంలో ఉన్న విషయమే. ఇట్లా మహాశ్రేయస్సును గలిగించే విజ్ఞానానికి అనేకులు దూరమై పోతున్నారు.

అందుచేత సాధ్యమైనంత వరకు సులభంగా అర్థమయ్యే పదాలతో, శైలితో, ఈ విజ్ఞానాన్ని పొందగోరే వారికి అందు బాటులో ఉండేట్టుచేయ పూనుకున్నాం.

కర్తా కారయితా చైవ ప్రేరకశ్చాను మోదకః
సుకృతే దుష్కృతే వాపి చత్వారస్సమ భాగినః

అంటే పుణ్యకర్మ అయినా, పాపకర్మ అయినా (1) చేసేవాడు (2) చేయించేవాడు (3) చెయ్యటానికి ప్రోత్సాహం గలిగించేవాడు

(4) చూచి సంతోషించేవాడు ఈ నలుగురూ, ఆ పుణ్యకర్మ పాపకర్మల యొక్క ఫలంలో సమభాగస్థులు అవుతారు.

కనుక భక్త సోదరులంతా తాము దీనివల్ల లాభం పొందుతూ ఈ గీతాభ్యాస ప్రచార రూప పుణ్య కర్మలో పాల్గొని తమ స్నేహితులు గూడా లాభం పొందటానికి ప్రయత్నం చేయండని మనవి చేస్తున్నాం.

ఓం తత్సత్,

శ్రీ కృష్ణానందాశ్రమ గీతా ప్రచార సంఘం.

5

ఓం పరస్మై బ్రహ్మణే నమః

ఓం లీలామానుష విగ్రహాయనమః-ఓం శ్రీకృష్ణాయనమః
ఓం జగద్గురవేనమః-ఓం సంసార వైరిణేనమః
ఓం గీతామృత మహోదధయేనమః
భగవద్గీతే భవద్వేషిణీం త్వాం అనుసందధామి.

# శ్రీ మద్భగవద్గీత-మానవ కర్తవ్యం

## ద్వితీయ సుమం

## గీతాతత్త్వం

పరమేశ్వరుడు మనుష్య దేహాన్ని పొందక పోయినప్పటికీ మాయచేత పొందినట్లుగా మాత్రం కనబడుతూ, శ్రీకృష్ణ నామంతో, జగద్గురు రూపంతో, దుఃఖ భూయిష్ఠమైన సంసారాన్ని హరించేదిన్నీ సర్వోపనిషత్తుల సారమైనదిన్నీ అయిన గీతను ఉపదేశించాడని శాస్త్రాలన్ని చెప్తున్నవి. స్వయంగా భగవద్గీత గూడా ఆ మాటే చెప్తున్నది.

అజోఽపిసన్నవ్యయాత్మా భూతానామీశ్వరోఽపిసన్
ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మ మాయయా
(గీ॥ 4-6)

నేను పుట్టుక లేని వాడనూ, నాశనం లేని వాడమా, సమస్త చరాచర భూతములకు ప్రభువునూ, నియామకుడనూ అయినప్పటికిన్నీ,

నా మాయాశక్తిచేత పుట్టిన వానివలె దేహం పొందినవానివలె కనబడు తున్నాను అని భగవద్వాక్యార్థం.

సర్వ శాస్త్రమయీగీతా సర్వ దేవమయీ యతః
సర్వ ధర్మమయీ యస్మాత్ తస్మాదేతాంస మభ్యసేత్.

సర్వ శాస్త్రాల సారమూ, సర్వదేవతా స్వరూపమూ, సర్వధర్మ మయమూ గనుక గీతనుఅభ్యసించాలి అని సజ్జనులంతా బోధిస్తున్నారు.

కనుక గీతా తత్త్వాన్ని తెలుసుకోటానికి ప్రయత్నం చేద్దాం.

## 1. అభ్యాసం

మనుష్య జన్మ సఫలం చేసుకోటానికి మార్గం మనం ప్రథమ సుమంలో గీత–ఉపనిషత్తులు, అధ్యాత్మ విద్య అనే శీర్షిక క్రింద,

(1) భగవద్గీత ఏం ఉపదేశిస్తున్నదో,
(2) ఉపనిషత్ అంటే ఏమిటో
(3) అధ్యాత్మ విద్య ఏం బోధిస్తుందో
(4) పరమేశ్వరుణ్ణి ఎట్లా, ఎందుకు సేవించాలో
(5) అట్లా సేవిస్తే ఏమవుతుందో, మోక్షం అంటే ఏమిటో
(6) సంసారం అంటే ఏమిటో
(7) సంసార దుఃఖం పోగొట్టుకోటం ఎట్లాగో
(8) మానవ జన్మ ఎంత గొప్పదో
(9) ఆత్మ జ్ఞానం పొందటమే మానవ కర్తవ్యం ఎందుకో, ఏమిటో

ఈ విషయాలను కొంత వరకు తెలుసుకున్నాం.

## ఈ ద్వితీయ సుమంలో

(1) మనకు సంసారం, దుఃఖం ఎందుకు కలుగుతున్నవో

(2) దుఃఖాది సప్తకం ఏమిటో

(3) అజ్ఞానం, అంటే ఏమిటో

(4) సంసార దుఃఖం పోవాలి అంటే, దానికి పరమేశ్వర కటాక్షం కావాలి దాని కోసం పరమేశ్వర ఉపదేశానికి అనుగుణంగా అభ్యాసం చెయ్యాలి అని చెప్పబడుతున్నదిగదా. అభ్యాసం అంటే ఏమిటో

(5) "జ్ఞానాదేవతు కైవల్యం" అంటే

"జ్ఞానం వల్లనే మోక్షం" అని చెప్పబడుతున్నది గదా. జ్ఞానం అంటే అదేమిటో, ఎట్లా కలుగుతుందో.

ఈ విషయాలను గురించి శ్రీమద్భగవద్గీత–ఉపనిషత్తులు, ఇతర గ్రంధాలు ఏం చెప్తున్నవో మరింత లోతుకుపోయి, మరింత విపులంగా తెలుసుకోటానికి ప్రయత్నం చేద్దాం.

ఒక్కమాట మాత్రం సాధకులమైన మనం మరచి పోగూడదు, అదేమిటంటే ఈ బ్రహ్మ విద్య = మోక్ష విద్య తలకెక్కాలంటే;

(1) ఏకాగ్రత (Concentration of mind)

(2) బుద్ధి నైశిత్యం (Sharpness of Intellect)

ఈ రెండు కావాలి.

అసలు తెలివి అంటే (1) చెప్పింది వెంటనే గ్రహించగల శక్తి (2) గ్రహించిన దానిని జ్ఞాపక ముంచుకొనే శక్తి ఈ రెండు కలిస్తే తెలివి అవుతుంది.

ఈ శక్తులు అభ్యాసం చేత పరమేశ్వర కటాక్షంచేత పొంద గల్గుతాం.

కనుక, అభ్యాసం ముఖ్యం నాయనా. మనం అభ్యాసంచేయకుండా ఎవరో హిమాలయా పర్వతాల్లోనుంచి, ఆకాశంనుంచి ఊడి పడి మనకు తీర్థమిచ్చి, నెత్తిన చెయ్యిపెట్టి అమాంతం పైకి పంపిస్తాడనుకోటం బుద్ధి తక్కువతనం. (Foolishness) అంటున్నవి శాస్త్రాలు. మనం అభ్యాసం చేయకుండా. చౌక బేరంతో మనం మన దుఃఖాన్ని సంసారాన్ని తీసివేసుకోటం సంభవం కానేకాదు. ఇట్లా మనం కష్టపడకుండా తేలికైనది ఏదైనా ఉపాయం ఎవరైనా చెప్తారేమో అనేగా మనం ఇక్కడా అక్కడా ఉత్సవాలకూ ఉపన్యాసాలకూ, అయన్నూ ఈయన్నూ దర్శించటానికి, కాశీకి రామేశ్వరానికి పోతూంటాము. కాని తేలికమార్గం ఎవ్వరు చెప్పటంలే. ఎవరైనా చెప్పాడో, అతడు మోసగాడే అన్న మాట నమ్ము నాయనా.

అర్జునుడు పరమేశ్వరుణ్ణి, జగద్గురువును ఆశ్రయించాడుకదా. "శిష్యస్తే ఽ హం శాధిమాంత్వాం ప్రపన్నం" (గీ 2 అ 7 శ్లో) నేను దుఃఖ సముద్రంలో ఉన్నాను. ఒడ్డున పడవెయ్యి తండ్రి అంటే జగద్గురువు పరమేశ్వరుడు అయిన శ్రీకృష్ణ పరమాత్మ,

"నీవు అట్లా చెయ్యి ఇట్లా చెయ్యి అట్లా చెయ్యవద్దు ఇట్లా చెయ్యవద్దు" అని దేనిని ఎట్లా అభ్యాసం చెయ్యాలో అది చెప్పి "నీవు అట్లా చెయ్యాలి" అన్నాడుగాని "నేను తీర్థ మిచ్చి నెత్తిన చెయ్యి పెడ్తా. నీ కొక పర్మిపికెట్టు ఇస్తా దాంతో నీ దుఃఖం పోయి మోక్షం పొందుతావు నీ వేం చేయనక్కరలేదు అర్జునా" అన్నాడా? లేదుగదా! మరి పరమేశ్వరుడే అననిదాన్ని ఈ చిన్న చిన్న వాళ్ళందరూ, మే

మంతవాళ్ళం, ఇంత వాళ్ళం మాకు చాలాశక్తులున్నవి, మా తీర్థ ప్రసాదాలతో, మా శక్తితో మీకు మోక్షం గలుగజేస్తాం అంటే అది సత్యమవుతుందా?

కనుక బాగా ఆలోచించుకో. నీవు ఒప్పవంచి గీతోపదేశం మీద విశ్వాసం ఉంచి, అభ్యాసం చేయడానికి పూనుకో. అట్లా అభ్యాసం చేస్తే క్రమ క్రమంగా నీ అజ్ఞానం పోతుంది. ఆనందం పొందుతావు. కాబట్టి ఈ రోజే కంకణం కట్టుకొని అభ్యాసం మొదలు పెట్టు బాబు. బాగుపడతావు. వేరే మార్గం లేదు.

శాస్త్రాను సారంగా నీవు చేసే నీ అభ్యాసమే నిన్ను రక్షించి సంసార దుఃఖంనుంచి బయటపడవేస్తుందిగాని, ఏ దేవత ఏ దయ్యమూ ఏ భూతము, ఏ యోగి ఇంకా మరెవ్వరు నీకు రక్షకులుగారు.

"తస్మాచ్ఛాస్త్రం ప్రమాణంతే
కార్యాకార్య వ్యవస్థితౌ
జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం
కర్మకర్తు మిహార్హసి"

(గీ. 6 అ. 24 శ్లో)

ఏది చేయతగింది ఏది చేయతగంది అనే నిర్ణయం చేసుకోటానికి శాస్త్రమే గీటురాయి నాయనా. అంటున్నది భగవద్గీత.

సద్గురువు అయినవాడు బోధ గురువు అయినవాడు నీవు సత్ప్రవర్తన, వినమ్రత, జిజ్ఞాస కలిగిన వాడవై, విశ్వాసంతో, పరమేశ్వర తత్త్వం తెలుసుకోవాలని కుతూహలంతో, ప్రార్థిస్తే నీకు శాస్త్రాను గుణ్యంగా, చక్కగా బోధించి, నిన్ను మార్గంలో పెడతాడు. ఇట్లా

చెయ్యి అని చేసి చూపిస్తాడేగాని అభ్యాసం చేయవలసిన వాడవునీవే నాయనా. ఇంకో మార్గం లేదు అని తెలుసుకో అంటున్నవి శాస్త్రాలు.

"నాన్యఃపంథా విద్యతేఽయనాయ (శే॥ ఉ॥)

ఈ అభ్యాసం చేయకుండా, ఇవన్నీ మాకు అర్థం కావటంలేదు. ఈ శాస్త్రాలు గీస్త్రాలు అసత్యాలు మేం ఈ బాధపడలేం అని తృణీకార భావంతో తోసివేసి, మహా విలువగలిగిన మనుష్య జన్మను తింటం, తాగటం, సినీమాలు, పిక్నిక్కులు, భరత నాట్యాలు, మోసాలు, అన్యాయాలు చేయటంతో పాడుచేసుకోవద్దు తండ్రీ నీవు అభ్యసిస్తూ ఉన్న విద్య (Education) అనేది ఉన్నదే అది పై విధంగా నీకు నీవు ద్రోహం చేసుకోటానికే పనికివస్తున్నదన్న సంగతి గుర్తెరుంగలేక పోతున్నావు. కనుక జాగ్రత నాయనా. నిన్ను నీవు ఉద్ధరించుకోటానికి శాస్త్రానుసారంగా ప్రయత్నించకపోతే, శాస్త్రానికీ, ఉపనిషత్తులకూ, భగవద్గీతకూ, దానిని ఉపదేశించిన పరమేశ్వరునకు ఏమీ నష్టం, లోపం లేదు, రాదు.

ఈ జన్మను పాడుచేసుకున్నందు వలన కుక్క, నక్క, పంది, గాడిద మొదలైన నీచ జన్మలను పొంది నీవే బాధపడతావు.

కనుక సద్బుద్ధిని ప్రసాదించుమని పరమేశ్వరుని ప్రార్థిస్తూ, సజ్జన సాంగత్యంలో కాలాన్ని సద్వినియోగం చేస్తూ ఒక మెట్టుమీది నుంచి ఇంకొకమెట్టు మీదికి ఎక్కటానికి నిరంతర ప్రయత్నం చేయాలినాయనా.

(1) అభ్యాసయోగ యుక్తేన,
చేతసా నాఽన్య గామినా
పరమం పురుషం దివ్యం
యాతిపార్థాను చింతయన్

(గీ 8 అ॥ 8 శ్లో)

(2) అభ్యాస యోగేనతతో
మామిచ్ఛాప్తుంధనం జయ

(గీ 12 అ॥ 9 శ్లో)

(3) అభ్యాసేన తు కౌంతేయ
వైరాగ్యేణచ గృహ్యతే

(గీ 6 అ॥ 35 శ్లో)

అని గీత మాటి మాటికి నీకు హితబోధ చేస్తూ నీవు చెయ్యాలి సిన దానిని నీకు సందేహరహితంగా ఉపదేశిస్తున్నది.

కనుక అభ్యాసం చెయ్యి నాయనా. మనుష్య జన్మను సఫలం చేసుకొంటావు.

# 2 దుఃఖాది సప్తకం

## (1) దుఃఖం

(1) జీవులు అంటే మనం అందరం దుఃఖాలతో బాధపడుతున్నాం అనేది మన అందరి అనుభవంలో ఉన్నమాటే గదూ! ఎంతెంత పెద్దవాళ్ళయినా, రాజాధిరాజులుగాని దేవతలుగాని మూడు లోకాలకు ప్రభువు అయిన ఇంద్రుడేగాని, కుబేరుడేగాని అందరు దుఃఖంతో బాధ పడుతున్నవారేగాని దుఃఖంలేని వారెవ్వరూ లేరు అని శాస్త్రాలు చెప్తున్నవి, మనం చూస్తున్నాం, వింటున్నాం గదూ!

(2) ఈ దుఃఖాన్ని తీసివేసుకోటానికి అందరు ప్రయత్నం చేస్తున్నారని గూడా మనకు తెలిసిందే గదూ

(3) ఈ దుఃఖం మనం చేసే ప్రయత్నాలన్నిటి వల్ల పోవటం లేదు అనేది గూడా మనకు తెలిసిందేగా.

(4) అందుచేత మనకు ఈ అనుమానం రావటానికి అవకాశం ఉంది. ఏమనిఅంటే అసలు ఈ జీవుడికి దుఃఖం అనేది స్వాభావికమే (Natural) అవునేమో అనీ - మరి స్వాభావికమే అయితే ప్రతివాడు ఈ దుఃఖం పోవాలని ఎందుకు ప్రయత్నం చేస్తాడు స్వాభావికంగాదేమో ఆగంతుకమే అయిఉండాలి అనీ — (ఆగంతుకం అంటే ఏదైనా ఒక కారణం చేత వచ్చిపడిందన్న మాట). ఈ విషయమే తేలకుండా వచ్చింది అని కొంత ఆలోచన మొదలుపెట్టే ప్రతివాడికి వస్తుంది ఈ శంక.

(5) దీనికి సమాధానం శ్రుతులూ (ఉపనిషత్తులు) గీతాఅన్ని ఏమని చెప్తున్న వంటే

నాయనా "ఈ దుఃఖం ఆగంతుకమేనోయ్. స్వాభావికంగాదు బాబూ" అని చెప్తున్నవి.

ఈ మాటే యుక్తులచేత అంటే బుద్ధి బలంచేత దృష్టాంతాలచేత విచారిస్తేనూ

మన అనుభవాన్ని మనం నిదానంగా విచారించి చూచుకుంటేనూ తేలుతుంది

ఆ విచారణ ఎట్లాఅంటే విను ఈ దుఃఖం నీకు స్వాభావికమే అయితే ఎంత ప్రయత్నంచేసినా స్వభావాన్ని ఎవడు తీసివెయ్యలేడు "స్వభావో దురతిక్రమః" స్వభావాన్ని తీసివెయ్యాలంటే స్వరూపాన్నే నాశనం చెయ్యాలిసొస్తుంది

అదెట్లా అంటె చూడు

బెల్లం ఉంది దానికి తీపి స్వభావం ఆ స్వభావమైన "తీపిని" బెల్లం నుంచి తీసివెయ్యాలంటే, వేరుచెయ్యాలంటే సాధ్యమవుతుందా? బెల్లాన్నే లేకుండా చేస్తే తప్ప అంటే బెల్లం స్వరూపం లేకుండా చేస్తే తప్ప నీళ్లల్లో వేసో నిప్పులోవేసో బెల్లాన్నే లేకుండా చేసినప్పుడే బెల్లం యొక్క స్వభావమైన తీపిపోతుంది గాని మరేవిధంగాను పోదుగదూ।

అట్లాగే మనకు దుఃఖం స్వాభావికం గనుక అయితే మనం నాశనం అయితే గాని మన స్వరూపమే లేకుండా పోతేగాని దుఃఖంపోదు గదా। మరి ప్రతివాడు దుఃఖం పోవాలని చాలా చాలా ప్రయత్నం చేస్తున్నాడుగా అంటే ఈ ప్రయత్నాలన్ని తన స్వరూప నాశనం కోసం చేస్తున్నాడని అనాలిసొస్తుంది. ఎవడైనా తాను నాశనం గావాలని ప్రయత్నంచేస్తాడా చెయ్యడుగా తాను ఉండి సుఖం అనుభవించాలి దుఃఖం పోగొట్టుకోవాలి అనుకొంటాడు గాని తను నశించాలి అనుకోడుగా। మరి దుఃఖం పోవాలని అందరు ప్రయత్నం చేస్తున్నారు. అంటే

అర్థం ఏమిటి? దుఃఖం మనుష్యునికి స్వాభావికంగాదని అది ఏదోకారణం చేత మధ్యవచ్చి పడిందనిన్నీ, అది సరియైన ప్రయత్నం చేస్తే పోతుం దనిన్నీ ఈ విచారణవల్ల తేలింది గదూ

ఇంకోమాటగూడా విచారిద్దాం. చూడు స్వభావం అయితే స్వరూపమేగదా! అటువంటప్పుడు ఆ స్వభావం వస్తువును ఎప్పుడైనాగాని విడిచి వుంటుందా? బెల్లానికున్న తీపి ఒకప్పుడుండి ఇంకొకప్పుడు లేకుండా పోతున్నదా పోదు.

కాని నీ దుఃఖం ఉన్నదే నీకు ఒకప్పుడుంటుంది. ఒకప్పుడు ఉండటంలేదు_ఎట్లా అంటే నీవు గాఢ నిద్రలో ఉన్నపుడు దుఃఖం ఉన్నదా? అప్పుడు దుఃఖం నిన్ను విడిచి పోతున్నదా లేదా విడిచిపోతు న్నదని మనకందరికి అనుభవంలో ఉన్నది గదా!

ఈ దుఃఖం నీ స్వభావమే అయితే నిన్ను ఇట్లా ఒకప్పుడు విడిచి ఒకప్పుడు పట్టుకొనడానికి వీలుండదని పై విచారణచేత తెలుసుకున్నాం గదా!

ఈ కారణాలవల్ల దుఃఖం అనేది నీకు స్వభావంగాదు_ఆగంతుకమే అని నిశ్చయం అయింది.

ఎప్పుడైతే ఇట్లా ఈ మొదటి పాయింట్ తేల్చుతున్నామో అప్పుడు ఇది ఆగంతుకమే_ఏదో కారణంవల్ల వచ్చిందయితే ఆ కారణం ఏమిటా అని విచారించాలని బుద్ధి ముందడుగు వేస్తుంది! ఆ కారణం తెలుసుకొని ఆ కారణాన్ని తీసివేసుకుంటే కార్యం అయిన దుఃఖంకూడా పోతుంది. Cause పోతే effect కూడా పోతుందిగా.

కనుక నాయనా నీ దుఃఖానికి అసలు కారణం తెలుసుకోరా బాబు. ఆ అసలు కారణం తీసేసుకోరా నాయనా. అంతేగాని తలనొప్పివస్తే మోకాలికి మందు రుద్దినట్లుగా నీకున్న దుఃఖం పోవటానికి ఏంచెయ్యాలో

అది చెయ్యకుండా వాళ్ళనీ వీళ్ళనీ ఆశ్రయిస్తేనూ ఆ దేవతలకు ఈ దేవతలకు మొక్కులు. ముడుపులు చెల్లిస్తేనూ ఏమీ లాభం లేదోయీ అని శాస్త్రం నీకు బోధిస్తున్నది. తెలివిగల వాడవైతే శాస్త్రం ఈఅసలు కారణాన్ని ఏమని చెపుతున్నదో తెలుసుకొని ఆ కారణాన్ని తీసివేసుకో నాయనా బాగుపడతావు.

ఇట్లా కార్యకారణాలను నిశితమైన బుద్ధితో శాస్త్రానుగుణ్యంగా విచారించి తెలుసుకొని ఈ దుఃఖంలోనుంచి బయటపడటానికే మనం మనుష్యులమై పుట్టామన్న మాటబాగా తెలుసుకో-అంతేగాని వేళపాళా నీతినియమం లేకుండా అడ్డమైందల్లా తినటానికి, తాగటానికి, సినిమాలు భరతనాట్యాలు చూట్టానికీ, జూదం, చీట్లాటలుఆడటానికి విస్కీబాటిల్సు ఖాళీ చేయటానికి చుట్టా, బీడీ సిగిరెట్లు తాగటానికి ముక్కుతో ముక్కుపొడుం పీల్చటానికి గుడ్డలు పరిసరాలు ఖరాబు చేసుకోటానికి నోటితో అయినప్పుడు కానప్పుడు తాంబూలం జర్దాలు నములటానికీ.

ఈ మాదిరిగా విచ్చలవిడిగా సంచరించటానికి డబ్బు గావాలి గనుక ఆ డబ్బును సంపాదించటానికి మోసంచేయటం, దొంగతనం చెయ్యటం, లంచాలు పట్టడం. ఇటువంటి నీచమైన పనులు చెయ్యటానికీ ఈ రీతిగా మనస్సు, కన్ను, నోరు, చెవ్వు మొదలైన ఇంద్రియాలు ఏది కావాలంటే దాన్నల్లా సప్లైచేసే బట్లర్లే, బానిసల్లే పశువు మాదిరిగా జీవించటానికిగాదు మనం మనుష్యులమై పుట్టింది అని బాగా తెలుసుకో.

అందుకోసం ఈ ఆగంతుకమైన దుఃఖానికి అసలు కారణం ఏదని శాస్త్రం చెప్తున్నదో దాన్ని తెలుసుకుందాం పట్టు.

(1) దుఃఖం ఉన్నది అనడంలో సందేహం లేదుగదా!

(2) దుఃఖానికి కారణం—శరీరం అనేది ఒకటి కలుగుట

కారణం-అంటున్నది శాస్త్రం అంటే తల్లి తడుపులో ప్రవేశించి ఒక స్థూలదేహంతో బయటపడటం అన్నమాట.

(3) శరీరం-ఎందుకు వచ్చింది అంటే కర్మలవల్ల వచ్చింది-అంటే నీవు ఇదివరకు మంచివీ చెడ్డవీ కొన్నిపనులు చేశావు, వాటి ఫలాన్ని నీవే అనుభవించాలి గనుక ఆ కర్మఫలంగా శరీరం వచ్చింది.

(4) మనం ఆ కర్మలు ఎందుకు చేశాం. చేయకుండా ఊరుకో లేకపోయినామా అంటే మనం ఆ కర్మలు రాగద్వేషాల వల్లచేశాం. (Likes and dislikes)

(5) ఆరాగద్వేషాలు ఎందుకు వచ్చినవి – అంటే అభిమానం వల్ల-అభిమానం అంటే "దేహమే" మనము అనుకోటంవల్ల అంటే (identifying ourselves with the body)

(6) ఆదేహాభిమానం ఎందుకు వచ్చింది - అంటే అవివేకం వల్ల అవివేకం అంటే వివేకం లేకపోవటం అంటే నీవు కానటువంటి దేహం నుంచి నీ అసలు రూపాన్ని విచారణ వల్ల వేరు చేసుకొనే శక్తి లేక పోవటం అంటే (Want of discriminating power to separate yourself from your body.)

(7) ఆ అవివేకం ఎందుకు వచ్చింది - అంటే అజ్ఞానం వల్ల అంటున్నది శాస్త్రం - అజ్ఞానం అంటే తెలివి లేకపోవటం - దేన్ని గురించిన తెలివి అంటే. నీ నిజస్వరూపాన్ని గురించిన తెలివిలేక పోవటం అంటే (Want of self Knowledge)

(8) ఇట్లా మన దుఃఖానికి మూలకారణం అజ్ఞానం అనీ ఈ అజ్ఞానం పోతే దుఃఖం పోతుంధి అనీ ఉపనిషత్తులు, గీతా అన్ని గూడ

బోధిస్తున్నవి కనుక అజ్ఞానాన్ని తీసివేసుకోవాలన్న మాట దుఃఖం పోవాలంటే

అందుకోసం ఈ దుఃఖాది సప్తకాన్ని (దుఃఖంతో మొదలైన ఈ ఏడింటిని) గురించి మరింత విపులంగా తెలుసుకొందాం. ఎందుకూ అంటే అసలు కారణమైన అజ్ఞానాన్ని పోగొట్టుకుంటే దుఃఖం పోయి పరమ సుఖాన్ని పొందుతాం గనుక

# దుఃఖాది సప్తకం

## (2) శరీరం

పైన చేసిన విచారణచేత మనకు దుఃఖం స్వాభావికంగా దనిన్నీ ఆగంతుకమే అనిన్నీ (ఏదో ఒక కారణంచేత వచ్చిన దనిన్నీ) తేలింది. ఆ కారణం ఏమిటి అని విచారిస్తే అది శరీరం కలగటం వల్ల – అంటే జన్మ ఎత్తటంవల్ల అంటే ఒక స్థూల దేహంతో తల్లి కడుపులో నుంచి బయట పడటంవల్ల అని శాస్త్రాలు చెప్తున్నవి. దేహంవల్లనూ, దేహంలో ఉన్న మనస్సు వల్లనూ ఈ దుఃఖం బాధ గలుగుతున్నవని మన అనుభవంలో గూడా ఉన్నది. ఈ శరీరంలో ఏమున్నవి అంటే చర్మము, (తోలు)మాంసము, రక్తము, కొవ్వు, ఎముకలు, నరములు, పాయ్ఖానా (Intestines) మూత్ర శాలలు Kidneys) ఇవేగాదా ఇందులో ఏ ఒక్కటీగూడా మంచి వస్తువు అనిపించుకోబడేది లేదుగదా ఈ చర్మము మొదలైనవాటికి ఏ క్షణంలోనైనా అపాయంరావచ్చు పాడైపోవటం సంభవించవచ్చు అనేక రకాలైన రోగాలు జబ్బులు శరీరంలో ఏదో ఒక భాగానికి వస్తూనే ఉన్న సంగతి మనకు తెలుసు. ఇట్లా శరీరానికివచ్చే జబ్బులవల్ల (వీటినే "వ్యాధులు" అంటారు) మనకు బాధ కలుగుతున్నది.

శరీరంలో మనస్సు అనేది ఒకటున్నది ఇది మహా చంచలం ఒక్కక్షణం గూడా స్థిరంగా ఉండదు. ఎప్పుడూ చలిస్తూనే పరుగెత్తుతూనే ఉంటుంది. అందుకనే దీనిని కోతితో పోల్చారు – ఉట్టి కోతి గాదు "కపిరపి చ కాపిశాయన మదమత్తః వృశ్చికేన సందష్టః అపిచ పిశాచ గ్రస్తః కింబ్రోమో వైకృతంతస్య". సగం మత్తు వచ్చేటట్లు

కల్లు తాగిన కోతి తేలు కుట్టి దయ్యం కూడా పట్టితే ఒక్క క్షణం అయినా స్థిరంగా ఉంటుందా? అదెట్లా గంతులు పెట్టుతుందో అట్లాగే ఈ మనస్సు ఒక సంకల్పం (విషయం) మీది నుంచి మరొ సంకల్పం మీదికి గంతులు పెట్టుతూ ఎడతెగని ఆలోచనలు చేస్తూ తేలని సమస్యల మీదికి పోతూ మనకు ఆందోళన కలిగిస్తూ శాంతి లేకుండా చేస్తూ ఉండటం మనకు అనుభవంలో ఉన్నది. ఇట్లా మనస్సుకు కలిగే ఆందోళనను అశాంతినీ "ఆధి" అంటారు ఈ రీతిగా ఈ శరీరానికి ఆధి వ్యాధులచేత దుఃఖం, బాధ, మనకు కలుగుతున్నవి అని మన అనుభవంలో ఉన్నదేగా.

ఇట్లా సంభవించే ఈ దుఃఖాలకు మనం "తాపత్రయం" అనే మాటను వాడుతుంటాం.

తాపత్రయం అంటే మూడు రకాలైన తాపం = దుఃఖం = బాధ అన్నమాట.

అవి ఏమిటి అంటే

(1) ఆధ్యాత్మిక తాపం (2) ఆధి భౌతిక తాపం (3) ఆధి దైవిక తాపం.

(1) ఆధ్యాత్మిక తాపం అంటే, పైన చెప్పుకొన్న ఆధులు. వ్యాధులు అన్నమాట. దేహానికి జబ్బులు, మనస్సుకు అశాంతీ ఆందోళన.

(2) ఆధిభౌతిక తాపం అంటే: ఇతర భూతాలవల్ల నీకు కల్గే బాధ. తేళ్ళు, పాములు. కుక్కలు మొదలైన వాటివల్ల.

(3) ఆధి దైవికం అంటే పిడుగులు పడడం, భూకంపాలు రావటం, వానలు లేకపోవటంవల్ల పంటలు పండక పోవడం, ఎక్కు

వగా వానలు కురిసి వరదలు వచ్చినందువల్ల పంటలు పాడై పోవటం మొదలైన వాటివల్ల బాధలు దుఃఖాలు.

మరి ఈ దుఃఖం అంతా శరీరం వల్లనేవచ్చింది అని చెప్పటం ఎట్లా అంటే చూడు.

మనం మేలుకున్నప్పుడు (జాగ్రదవస్థలోనూ), కలలు కనేట ప్పుడు (స్వప్నావస్థలోనూ) మనకు బాధ దుఃఖం కలుగుతున్నది గాని గాఢంగా నిద్రపోతున్నపుడు (సుషుప్తి అవస్థలో) దుఃఖం బాధ లేదు గదా:

ఇది ఇట్లా ఎందుకు అంటే జాగ్రదవస్థలోను, స్వప్నావస్థలోను, మనకు శరీరం, శరీరంతోపాటు మనస్సు ఉన్నవి కనుక దుఃఖం బాధ ఉంటున్నవి. కాని సుషుప్తిలో, మనకు దేహం మనస్సు లేవుగనుక– (అంటే వాటితో కలుసుకొని, వాటిని అభిమానించటం లేదు గనుక) దుఃఖం, బాధలేకుండా పోతున్నవి. అంటే ఏమిటి అర్థం, ఎప్పుడుశరీరం ఉంటుందో (శరీరమే నేను అనే అభిమానం ఉంటుందో) అప్పుడు బాధ దుఃఖం ఉంటుందిగని ఎప్పుడు శరీరం లేకుండా పోతుందో అప్పుడు బాధ దుఃఖం లేవని తెలుస్తున్నది గదా, కనుక.

మనకు దుఃఖం శరీరం వల్లనే కలుగుతున్నదని నిర్ణయం అయిం దన్నమాట.

ఈమాటే గీత చెప్తున్నది కూడా, చూడు.

"జన్మ మృత్యు జరావ్యాధి దుఃఖ దోషాను దర్శనం"

( గీ॥ 13–8 )

అంటే ఒక శరీరంతో జేనెడు తల్లిగర్భంలో 10 నెలలు తల క్రిందుగా పాయ్ఖానా (Intestines), మూత్రశాలలు (Kidneys) మధ్య దుర్గంధయుతమైనచోట మావిచేత కప్పబడి తల్లి తినే ఉప్పు. కారం. పులుసు వీటి రసములు కోమలమైన శరీరంమీద పడుతూంటే, చెప్ప శక్యంగాని బాధలు పడిపడి స్థూలదేహంతో బయటపడటం. పడినప్పటి నుంచి. ఆ రోగాలు, ఈ రోగాలు వచ్చిబాధ పడటం, ముసలితనంతో బాధపడడం అనే దుఃఖ దోషములను గురించి విచారించుకొంటే, యీ బాధలను ఎట్లా లేకుండా చేసుకోవాలో తెలుస్తుంది అంటున్నది గీతా మాత.

22

# దుఃఖాది సప్తకం

## (3) కర్మము

అట్లాగా, అదా విషయం—సరే

ఈ శరీరం ఎందుకు వచ్చింది చెప్పండి. అంటే

విను.

మనం ఒక్క క్షణం గూడా ఊర్కోకుండా ఎప్పుడూ ఏదో ఒక పని = కర్మ. మంచిదిగాని, చెడ్డదిగాని ఏదో ఒక్కటి దేహంతో గాని, వాక్కుతోగాని మనస్సుతోగాని చేస్తూ ఉండటంవల్ల, ఈ దేహం వస్తున్నదని శాస్త్రం చెప్తున్నది.

కనుక ఆ కర్మను గురించి మరింత బాగా అర్థం చేసుకొంటే బాగుపడతాంగదూ. తెలుసుకుందాం పట్టు.

కర్మములు = (అంటే మనం చేసే పనులు అన్నమాట–మంచి పనిగాని, చెడ్డపని గాని.)

మనం మామూలుగా మాట్లాడుకొనేటప్పుడు మనకేదైన కష్టం, నష్టం, వచ్చినప్పుడు ఏమంటాము. అది నా కర్మరా, నా ప్రారబ్ధంరా, అనుభవిస్తున్నాను, నా దురదృష్టంరా అంటాము. అంటే ఏమిటన్న మాట మనం పూర్వం చేసిన చెడ్డ కర్మ = పనియొక్క ఫలం ఇప్పుడు అనుభవిస్తున్నామన్న మాట.

ఏదైన సుఖం, సంతోషం గలిగినప్పుడు, వాడు గొప్ప అదృష్ట వంతుడురా, వాడి అదృష్టం బాగుంది. అంటే మనం అనుకోకుండా తెలియకుండా ఏదైన లాభం గలిగిందన్నమాట.

అదృష్టం అంటే కనపడనిది. ఏమిటి కనబడనిది. పూర్వం మనం ఏ మంచి కర్మ చేసామో మనకు జ్ఞాపకం లేదు తెలియదు కాని దాని ఫలం ఇప్పుడు ఈ సుఖం సంతోషం రూపంగా అనుభవంలోకి వచ్చిందన్నమాట.

కాబట్టి, కర్మ అన్నా, దురదృష్టం, ప్రారబ్ధం అన్నా, అదృష్టం అన్నా మనం పూర్వ జన్మల్లో చేసుకొన్న చెడ్డవి, మంచివి అయిన పనులయొక్క ఫలం మనం ఇప్పుడు దుఃఖ రూపంగానూ సుఖ రూపంగానూ, అనుభవిస్తున్నామనే గదూ, మన మాటల యొక్క అర్థం, అందుకనే, మనం చేసుకొన్నది మనం అనుభవించాలని అంటుంటాం.

ఈ "కర్మము" (3) విధాలని శాస్త్రం చెప్తున్నది.

(1) పుణ్య కర్మ (2) పాపకర్మ (3) మిశ్ర కర్మ.

అసలు పుణ్య కర్మలు ఏవో, పాప కర్మలు ఏవో, మిశ్ర కర్మలు ఏవో, అది ఎట్లా నిర్ణయించటం అంటే, భగవంతుడు భగవద్గీతలో 16 వ అధ్యాయంలో (24) శ్లోకంలో చెప్తున్నాడు.

తస్మాత్ శాస్త్రం ప్రమాణంతే
కార్యాకార్య వ్యవస్థితౌ
జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం
కర్మకర్తు మిహార్హసి

(గీ॥ 16-24)

ఏది చేయతగిందో (మంచిదో).
ఏది చేయతగందో (చెడ్డదో).

ఈ విషయం తెలుసుకోటానికి శాస్త్రమే ప్రమాణం(Aurhority)

అంతేగాని ఎవడేగాని వాడు ఎంత వాడైనా వాడు ఊహించి. తన బుద్ధికి తోచినట్లు చెప్పేదిగాదు.

మరి శాస్త్రమంటె. వేదమంటే ఉపనిషత్తులంటే. ఇవి ఏ మనుష్యుడూ వ్రాసినవిగాని. ఊహించి చెప్పినవిగాని గాదు మరేమంటే ఇవి పరమేశ్వరునిచేత మన మేలుకొరకు. నిర్మింపబడ్డవి. ఏ పురుషుడో. స్టెనోగ్రాఫర్‌ని పిలిచి రాసుకో అని Dictate చేస్తే Shorthand లో వాటిని వ్రాసి టైపుచేసి అచ్చువేయించినవి గావు. మరేమంటే పరమేశ్వరునుంచి బహిర్గతములై. ఒక గురువునుంచి, ఒక శిష్యుడువిని గ్రహించి. అతడు తన శిష్యులకు చెప్పగా, మళ్లా ఆతడు తన శిష్యులకు చెప్పగా. ఇట్లా బోధించుట. వినిగ్రహించుటవల్ల వచ్చినవి. అందువల్లనే వీటిని "అపౌరుషేయములు" అంటున్నారు. వినటంవల్ల గ్రహింపబడినవిగాన, "శ్రుతులు" అంటున్నారు.

కనుక మంచీ చెడు నిర్ణయానికి శాస్త్రమే ప్రయాణం వాయనా.

ఏ కర్మలవల్ల ఎట్లాంటి దేహాలు వస్తవో ఆ విషయం గూడా ఉపనిషత్తులు, భగవద్గీతా చెప్తున్నవి.

(1) పుణ్యేన పుణ్యంలోకం నయతి,
పాపేన పాపము భాభ్యామేవ
మనష్యలోకం

[ప్రశ్న॥ఉ॥ 3-7]

అంటే శాస్త్ర విహితమైన పుణ్య కర్మచేత దాని ఫలమైన స్వర్గాది పుణ్య లోకాల్లో జన్మ వస్తుంది. అంటే ఆ లోకాలకు తగిన శరీరం కలుగుతుంది.

శాస్త్ర నిషిద్ధమైన పాప కర్మచేత తిర్యగ్జంతువుల

(అడ్డంగా ఉండే జంతువులు అన్నమాట) జన్మలు వస్తవి. ఇక పుణ్యం పాపం కలిసిన మిశ్రకర్మచేత మనుష్య జన్మ వస్తుందిఅంటున్నది ప్రశ్నోపనిషత్తు

(2) సాధుకారీ సాధుర్భవతి, పాపకారీ
పాపోభవతి, పుణ్యః పుణ్యేన
కర్మణాభవతి పాపః పాపేన

(బృ॥ఉ॥ 4-4-5)

మంచి పని చేయువాడు మంచి దేహాన్ని, చెడ్డ పని చేయువాడు చెడ్డ దేహాన్ని, ఆయా కర్మలకు ఫలమైన మంచీ చెడ్డ దేహాలను పొందుతాడంటున్నది బృహదారణ్యక ఉపనిషత్తు.

(3) రమణీయ చరణాః రమ
ణీయాం యోనిం............
కపూయ చరణాః కపూయాం
యోనిం, శ్వయోనింవా, సూకర
యోనింవా, చండాల యోనింవా

[ఛాందోగ్య॥ ఉ॥]

పుణ్య కర్మకు ఫలంగా, రమణీయమైన దేహాన్ని, పాప కర్మకు ఫలంగా, నీచమైన కుక్క దేహంగాని, పంది దేహంగాని, చండాల దేహంగాని పొందుతాడంటున్నది ఛాందోగ్య ఉపనిషత్తు

(4) సుకృతేఽను భూత్వా
ఇమంలోకం హీనతరం వావిశన్తి
(ముండక॥ ఉ॥ 1-2-10)

పక్వానికి వచ్చిన కర్మఫలాన్ని అనుభవించి, మళ్ళీ మిగిలి ఉన్నదీ, పక్వానికి వచ్చినదీ అయిన కర్మ ఫలానికి తగినట్లుగా మనుష్య జన్మగాని, లేక పశువులూ, పక్షులు, పురుగులు మొదలైన నీచ జన్మలను గాని పొందుతాడంటున్నది ముండక ఉపనిషత్తు.

(5) "తానహం ద్విషతః క్రూరాన్
సంసారేషు నరాధమాన్
క్షిపామ్యజ స్ర మశుభాన్
ఆసు రీష్వేవ యోనిషు

(6) ఆసురీం యోనిమాపన్నాః
మూఢా జన్మని జన్మని,
మామ ప్రాప్యైవ కౌన్తేయ
తతోయాన్త్యధ మాంగతిమ్.
(గీ॥ 16-19,20)

పరమేశ్వరుని ద్వేషించే వారునూ, క్రూరకర్మలు చేసేవారును, అయిన మనుష్యులు పాపకర్మ ఫలితంగా పెద్దపులి, పాము, మొదలైన జన్మలను ఎత్తి ఎత్తి ఇంకా ఇంకా నీచమైన క్రిములు, కీటకాలు మొదలైన జన్మలనే పొందుతూ, అధోగతికి పోతారు అంటున్నది భగవద్గీత.

మరి ఇన్ని శాస్త్రాలున్నవి, ఏది మంచి శాస్త్రమో ఏది అభ్యసించాలో దిక్కు తెలియటం లేదు అంటే ఆ మాటగూడా శాస్త్రంద్వారా భగవంతుడే చెప్తున్నాడు.

(7) అనంత శాస్త్రం బహువేదితవ్యం
అల్పశ్చకాలో బహవశ్చవిఘ్నాః
యత్సారభూతం తదుపాసితవ్యం
హంసోయథాక్షీరమివాంబు మిశ్రం

[ఉత్తర గీత]

శాస్త్రాలు అనంతంగా ఉన్నవి; చాలా చదవాలిసింది తెలుకోవాలసింది ఉన్నది. పోనీ ఇవన్నీ చదువుదాంలే అనుకుంటే, ఆయుష్కాలం చూడబోతే చాలా తక్కువ, ఒకడు 10 ఏళ్లే జీవిస్తాడు, ఒకడు పది రోజులే ఉంటాడు, ఇంకోడు పుట్టిన రోజునే పోతాడు.

మహా బతుకుతే కలియుగంలో 100 సంవత్సరాలు ఆయుర్దాయం అంటున్నారు గదా, మరి ఈ 100 సంవత్సరాలలోనైనా, ఎన్ని శాస్త్రాలు చదువుతాడు మనుష్యుడు అని విచారిస్తే 100 సంవత్సరాలలో సగం నిద్రలో పోతున్నది 10, 15 సంవత్సరాలు బాల్యంలో మూఢత్వంతో, ఆట పాటలతో పోతున్నది. ఇంకా కొంత, ఏ శక్తీ లేక ఎందుకు పనికిరాకుండా ఉండే ముసలి తనంతో పోతున్నది. ఇక మిగిలింది, ఏదైనా పనికి వచ్చేది కాలం ఏ 20, 25 సంవత్సరాలో యౌవనం అనేది ఉందీ అంటే దాంట్లో మనుష్యుణ్ణి స్త్రీ లౌల్యం అనే దయ్యం ఆవేసిస్తుంది. మరివీడు ఈ శాస్త్రాలన్నీ ఎప్పుడు చదువుతాడు. చదవ లేడు గనుక.

పరమేశ్వరుడు ఏం ఉపదేశిస్తున్నాడంటే ఒరే నాయనా, నీళ్లు పాలు కలసిఉంటే నీళ్ళను వేరుచేసి, వదలిపెట్టి పాలను మాత్రం త్రాగగల శక్తి "హంసకు" ఎట్లా ఉన్నదో

అట్లాగే పనికి మాలిన శాస్త్రాలన్నింటినీ వదలిపెట్టి సారభూత మైనదన్నీ, దుఃఖ భూయిష్ఠమైన సంసారంలో బడకుండా, జన్మ అనేది లేకుండా చేసేదన్నీ, శరీరం కలగకుండా చేసేదన్నీ అయిన శాస్త్రాన్ని, బ్రహ్మ విద్యను ఉపాసించరా తండ్రీ.

పందులు కూడా కోరే విషయ భోగాల కోసం, అంటే, తినటం, తాగటం, నిద్రపోవటం, సంతానంను పుట్టించటం అనే వీటికోసం, తుచ్ఛ మైనవిన్నీ, మనుష్యునకు తగనటువంటివిన్నీ అయిన పాప కర్మలు చేస్తూ ఆయుష్కాలాన్ని నాశనం చేసుకోవద్దురా బాబు అంటున్నది ఉత్తర గీత.

(1) కనుక శాస్త్రానుకూలమైన పుణ్యకర్మ చేత ఏ జన్మలు పొందుతామో

(2) శాస్త్రానికి విరుద్ధమైన పాపకర్మ చేత ఏ జన్మలు పొందు తామో

(3) మిశ్రకర్మ చేత ఎట్లాంటి దేహాలు వస్తవో,

ఈ విషయాలు తెలుసుకొంటే బాగుపడటానికి వీలున్నది గదూ. అందుచేత తెలుసు కొందాం, పట్టు

ఈ పుణ్య, పాప, మిశ్ర కర్మలనేవి ఒక్కొక్కటి (1) ఉత్కృష్టము (2) మధ్యమము (3) సామాన్యము అని మళ్లా మూడు విధాలుగా విభా గింపబడి ఉన్నవి. ఒక్కొక్క రకమైన కర్మచేత ఎట్లాంటి జన్మలు, దేహాలు, వస్తవో, ఆ విషయం విచారించి తెలుసుకొందాం.

## (I) పుణ్యకర్మ

| | |
|---|---|
| 1) ఉత్కృష్ట పుణ్యకర్మ వల్ల (చాలా చాలాగొప్ప దైన పుణ్యకర్మ అన్నమాట.) | హిరణ్యగర్భుడు, చతుర్ముఖ బ్రహ్మ మొదలైన వారల దేహాలు. |
| 2) మధ్యమ పుణ్యకర్మ వల్ల | ఇంద్రుడు లోకపాలురు మొదలైన వారల శరీరాలు. |
| 3) సామాన్య పుణ్యకర్మ చేత | యక్షులు, రాక్షసులు మొదలైన వారల శరీరాలు, |

## (II) పాపకర్మ

| | |
|---|---|
| 1) పాపోత్కర్షంవల్ల (పెద్దపెద్ద పాపకర్మలు చేస్తే) | ఇతరులకు దుఃఖాన్ని కలిగించే విష వృక్షాలు, ముళ్ళచెట్లు పెద్దపులి పాము మొదలైన శరీరాలు, |
| 2) పాపమధ్యంవల్ల (మధ్యరకం పాపంవల్ల) | పనస, మామిడి, అరటి కొబ్బరిమొద లైన ఫలవృక్షాలు, మల్లె, మందార మొదలైన పూలచెట్లు ,దున్న, గాడిద మొదలైన శరీరాలును. |
| 3) పాప సామాన్యం చేత | అశ్వత్థం (రావి), తులసి, బిల్వం మొదలైన ఈశ్వర సేవకు పనికి వచ్చే ఆకులుగలచెట్లును: ఆవు, ఏనుగ మొదలైన జంతువుల దేహాలును. |

## (III) మి శ్ర క ర్మ

| | |
|---|---|
| 1) మి శ్ర క ర్మ యొక్క ఉత్కృష్టంచేత (అంటే పుణకర్మ చాలాచాలాఎక్కువగానూ పాపకర్మతక్కువగానూ) | నిష్కామ కర్మానుష్ఠానం, దానివల్ల చిత్తశుద్ధి దానివల్ల సాధన చతుష్టయ సంపత్తి దానివల్ల సద్గురులాభం దానివల్ల శ్రవణ మనన నిదిద్యాపనములు జ్ఞానం, దానివల్ల జీవన్ముక్తి సుఖం కలిగించే మనుష్య శరీర ప్రాప్తి. |
| 2) మిశ్రకర్మ మధ్యమం చేత | తనవర్ణమూ తన ఆశ్రమమునకుతగిన కామ్యకర్మ చేయుటకు యోగ్యమైన మనుష్య శరీర ప్రాప్తి. |
| 3) మిశ్ర కర్మ సామాన్యం చేత | ఛండాలుడు, పుల్కసుడు, కిరాతుడు మొదలైన మనుష్యశరీరప్రాప్తికలుగుతున్నవని శాస్త్రిలు బోధిస్తున్నవి. |

ఈ వివిధాలైన కర్మలను గురించి తెలుసుకొంటే వాటిలో మంచి వాటినే చేయటానికి మనుష్యుడు పూనుకుంటాడు గనుక వాటిని గురించి గూడా తెలుసుకుందాం.

ఇవి మళ్ళా

I. మానసిక-పుణ్యకర్మలు, పాపకర్మలు, మిశ్రకర్మలు అనీ

II. వాచిక-పుణ్యకర్మలు, పాపకర్మలు, మిశ్రకర్మలు అనిన్నీ

III. కాయిక-పుణ్యకర్మలు, పాపకర్మలు, మిశ్రకర్మలు అనిన్నీ విభాగింప బడ్డవి.

## I. మానసిక కర్మలు

(1) పుణ్యకర్మలు :

1. సగుణచింత ధ్యానం. 2. నిర్గుణచింత విచారం. 3. పరలోకచింత. 4. పరోపకారచింత. 5. భక్తి జ్ఞాన వైరాగ్యచింత. 6. మోక్షేచ్ఛ. ఇవన్నీ మానసిక పుణ్యకర్మలు.

(2) పాపకర్మలు :

1. విషయభోగచింత. 2. పరాపకారచింత (ఇతరులకు అపకారం హానిచేయాలని ఆలోచన) 3. వేదాలు, శాస్త్రాలు ఇవేమీ ప్రమాణంగాదు. ధర్మాధర్మాలు అనేవిలేవు పరలోకాలులేవు. మన ఇష్టప్రకారం మనం సంచరించవచ్చు అనేభావన ఇవన్నీ మనస్సుచేతచేయబడే పాపకర్మలు.

(3) మిశ్రకర్మలు :

సగుణ నిర్గుణచింత చేసేటప్పుడు విషయచింత మొదలైన పాపకర్మలు చేయటం మిశ్రకర్మ.

## II. వాచికకర్మములు

(1) పుణ్యకర్మలు :

గీతను చదవటం చదివించటం. సహస్ర నామములు, అష్టోత్తర నామములు చదవటం చదివించటం ఇతరులకి ఉపకారమూ, మేలూ గలిగే మాటలుచెప్పటం సత్యం పల్కడం ఇవన్నీ వాచిక పుణ్యకర్మలు.

(2) పాపకర్మలు :

1. పెద్దలను పుణ్యపురుషులను దూషించటం.

2. ఇతరులను ఆడరాని మాటలనాడటం.

(3) అసత్యం చెప్పటం

(4) చెడ్డరకం పుస్తకాలు నావెల్సు స్త్రీ పురుష సంభోగ సంబంధములైన వార పత్రికలు మాస పత్రికలు చదవటం మొదలైనవి

(3) మిశ్రకర్మ

గీతా పఠనం వేదాంత శాస్త్ర పఠనం మొదలైన పుణ్య కర్మలు చేసే సమయంలో ప్రాపంచిక విషయాలను గురించి మాట్లాడటం అసత్యములు పల్కటం పరులను దూషించటం మొదలైనవి మిశ్రకర్మలు

## III కాయిక కర్మలు

(1) పుణ్య కర్మలు

(1) గురు దేవతాదులకు నమస్కారం పూజ ప్రదక్షిణం చేయటం

(2) పరుల దేహానికి పీడ, బాధ, కలిగింప కుండటం - హింస చేయకుండటం

(3) సత్పురుష సందర్శనం చేయటం వారు చేయు బోధను మనస్సుకు పట్టించుకొని ఆ బోధకు అనుకూలంగా ఆచరించటం చేయటం (అంతేగాని ఊరికే చూచిరావటం కాదు)

(4) పరోపకారం చేయటం

(5) లోకానుగ్రహ సంచారం అంటే ఇతరులకు హితమును బోధించుటకు ఒకచోటనుంచి ఇంకొక చోటికి పోవటం

(6) బ్రహ్మచర్యమును పాటించటం

(7) పాత్రులైన వారలకు అన్నాది దానములు చేయటం

(2) పాపకర్మములు

1. పరహింస
2. పరస్త్రీ గమనం
3. పరుల వస్తువులను అపహరించటం (దొంగిలించటం)
4. దుష్టులతో సహవాసం

5. అయినప్పుడు కానప్పుడు ఎక్కడ బడితే అక్కడ కాఫీ హోటళ్లలోనూ రైలు స్టేషన్లలోనూ అమ్మే వండిన పదార్థాలను, తినటం తాగటం, విస్కీ బ్రాంది మొదలైనవి తాగటం గంజాయి చుట్టలు సిగరెట్లు బీడీలు తాగటం పొడుం పీల్చటం ఈ మొదలైనవన్నీ కాయిక పాపకర్మములు

(3) మిశ్రకర్మములు

(1) అన్నదానం కోసం ఇంకొకళ్ళ ధనాన్నీ, ద్రవ్యాన్నీ, దౌర్జన్యంతో దోచుకోటం (2) దేవాలయాలు నిర్మించే ఉద్దేశంతో ఇతరుల విత్తాన్ని దొంగిలించటం చలివేంద్రలు పెట్టించేటప్పుడు గుళ్లు గోపురాలు కట్టించేటప్పుడు కూలీలకు కూలి ఇయ్యకుండా ఎగవేయటం తక్కువకూలి ఇయ్యటం ఇవన్నీ కాయిక మిశ్రకర్మలు

ఈ మానసిక వాచిక కాయిక కర్మలను గురించి గీతోపదేశాన్ని తెలుసుకొందాం

(1) దేవద్విజగురు ప్రాజ్ఞ
పూజనం శౌచమార్జవమ్
బ్రహ్మచర్య మహింసాచ
శారీరం తప ఉచ్యతే
(గీ. 11-17-14)

దేవుని ద్విజులను గురువులను జ్ఞానులను భక్తులను పూజించటం నమస్కరించటం, శుచిత్వం గలిగిఉండటం సత్ప్రవర్తన బ్రహ్మచర్యం అహింస కలిగి ఉండటం ఇవన్ని కాయిక పుణ్యకర్మ రూప తపస్సు అనబడుతవి.

(2) అనుద్వేగకరం వాక్యం
సత్యం ప్రియ హితం చయత్
స్వాధ్యాయా భ్యసనం చైవ
వాఙ్మయం తప ఉచ్యతే
(గీ 17-15)

ఇతరులకు భయం, కష్టం, దుఃఖం, కలిగించనివీ వినటంచేత సుఖం గఁగచేసేవీ సత్యమైనవీ మాటలు చెప్పటం గీత ఉపనిషత్తులు మొదలైన సద్గ్రంథ పఠనం పరమేశ్వర నామ సంకీర్తనం ఇవన్నీ వాచిక పుణ్యకర్మ రూపతపస్సు అవుతుంది

(3) మనః ప్రసాదః సౌమ్యత్వం మౌనమాత్మ వినిగ్రహః
భావ సంశుద్ధిరిత్యేతత్తపోమాన సముచ్యతే.
( గీ॥ 17–16 )

1. మనస్సునందు ఆందోళన విచారం అశాంతి ఏమీలేకుండా ఉండటం. అంటే మనస్సును కోరికలు ఆశలు ఏమీలేకుండా ఉంచుకోటం అంటే ప్రాపంచిక విషయాలను కోరకుండా ఉండటం ఇతర ప్రాణులకు మేలును కోరుతూ ఉండటం.

2. మౌనంతో ఉండటం అంటే నోటితో మాట్లాడకుండా ఊఁ ఆఁ. ఆహఁ, ఉహూఁ అంటూ చేత్తో సంజ్ఞలు చేస్తూగాని, కాగితంమీద గాని పలకమీదగాని ప్రాపంచిక విషయాలను గురించి వ్రాస్తూ తెలియ చేయటం మౌనంగాదు. మరేమంటే ప్రాపంచిక విషయాల మీదనుంచి చిత్తాన్ని మరలించి పరమేశ్వర తత్త్వం మీదనిలిపి లోలోపల మననం చేయటం.

3. ఇతరులను మోసపుచ్చే తలంపు లేకుండటం.

ఇవన్ని మానసిక పుణ్యకర్మ రూపమైన తపస్సు అనిచెప్పబడు తుంది.

(4) సత్కార మానపూజార్థం తపోదంభేన చైవయత్
క్రియతే తదిహప్రోక్తం రాజసంచల మధ్రువమ్.
(5) మూఢగ్రాహేణాత్మనోయత్ పీడయాక్రియతే తపః
పరస్యోత్సాదనార్థం వాతత్తామ సముదాహృతం.
[ గీ॥ 17–18, 19 ]

'తాను పుణ్య పురుషుడనీ సాధువనీ పేరుతెచ్చుకోటానికీ, ఇత రులచేత పొగడబడటానికిన్నీ సత్కరింపబడటానికీ సన్మానాలు పొంద టానికీ ధనము వస్త్రాలు భోజనం ఇవన్నీ పొందటానికి డంబాచారంతో చేయబడే పుణ్యకర్మలూ శాస్త్రానికి విరుద్ధంగా కటిక ఉపవాసాలు చేస్తూ నియమాలు పాటిస్తూ ఇతరులను నాశనం చేయడానికీ 'చేతబడుల' చేయ టానికీ శక్తిని సంపాదించేందుకు చేసేకర్మలన్నీ పాపకర్మలనీ గీత హెచ్చరిస్తున్నది.

ఈ రీతిగా వివిధాలైన కర్మలను వాటివల్ల వచ్చే మంచీచెడ్డ శరీ రాలను గురించి విచారించినందువల్ల ఏంలాభమయ్యా అంటే:

"మనుష్యుడై పుట్టి బాగుపడదలచుకొన్న ప్రతివాడూ ఉత్కృష్ట మైన మానసిక వాచిక కాయిక పుణ్యకర్మలు చేయడానికే నిరంతరంగా ప్రయత్నం చేయాలనీ పాపకర్మలను చేయరాదనీ శాస్త్రం బోధిస్తున్న దనిన్నీ ఈ బోధ అంతా మన బాగుకొరకేననిన్నీ శాస్త్రానికిగాని శాస్త్రాన్ని నిర్మించిన పరమేశ్వరునికిగాని ఏమీ ఒరిగి పడదనిన్నీ సందేహ రహితంగా తెలుసుకోవాలి నాయనా.

అంతేగాని 'ఈ శాస్త్రాలు గీస్త్రాలు అన్నీ అబద్ధాలు ఈ కాలా నికి కాదు ఇవన్నీ ఏదో పాతకాలంలో వాళ్ళకోసం కల్పింపబడ్డవి అని తృణీకరించి పాపకర్మలు చేస్తూపోతావా తనవేలితో తనకన్నును తానే పొడుచుకున్న వాడిమాదిరిగా పాడైపోతావు. అంటే శాస్త్రాన్ని ధిక్క రించి సత్పురుషుల బోధను తృణీకరించి పాపచింతా, పాపకర్మలూ చేస్తే దానికి ఫలంగా ఈ మనుష్య జన్మపోయిన తరువాత అంటేప్రాపం చిక భాషలో నీవు చచ్చిపోయిన తర్వాత నీవు కుక్కవో, పందివో, నల్లివో, బల్లివో చెట్టో చేమో ఈలాంటి జన్మలు పొందుతావు. నానా దుఃఖాలు అనుభవిస్తావు సుమా. అందుకోసం జాగ్రతగా మసలుకో

బాబూ. నీకు తెలియని విషయాన్ని నీ మేలుకోరి, నీకు ఉపదేశంచేసేది శాస్త్రం అని బాగా తెలిసికొని మహాశ్రేయస్సును పొందటానికి తగిన మానవదేహం పడిపొయ్యేలోపల కొంతైనా ఉత్కృష్టమైన మానసిక వాచిక కాయిక పుణ్యకర్మచేసి కనీసం ప్యాసుమార్కులు అయినా సంపాదించుకొంటే ఈమాటువచ్చే జన్మ ఇంకా ఎక్కువ ప్రయత్నంచేసి ఎక్కువగా ఈశ్వర కటాక్షాన్ని పొంది సంసారంలోనుంచి బయటపడే శక్తిగల జన్మ వస్తుందని భగవద్గీత చెప్తున్నది.

ప్రాప్య పుణ్యకృతాం లోకాన్
ఉషిత్వా శాశ్వతీస్సమాః
శుచీనాం శ్రీమతాం గేహే
యోగభ్రష్టో భిజాయతే
( గీ॥ 6_41 )

అంటున్నది గీత.

కనుక సద్బుద్ధిగలిగి శాస్త్రానుగుణ్యమైన సత్ప్రవర్తన గల వాడవు కానాయనా.

# దుఃఖాది సప్తకం

(4) 1. రాగద్వేషాదులు

సరే – కర్మలవల్ల దేహం వస్తున్నదని తెలిసింది.

మరి ఎవరైనా ఈ కర్మలు ఎందుకు చేస్తాడయ్యా? చేయకుండ ఊర్కో గూడదూ?

అంటే విను

రాగద్వేషాదులవల్ల చేస్తాడు కర్మలు. అంటున్నది శాస్త్రం. ఆ రాగద్వేషాదులు ఏమిటీ అంటే

1. రాగం, 2. ద్వేషం, 3. కామం, 4. క్రోధం, 5. లోభం, 6. మోహం, 7. మదం, 8. మాత్సర్యం, 9. ఈర్ష్య. 10. అసూయ, 11. దంభం, 12. దర్పం, 13. అహంకారం, 14. ఇచ్ఛ, 15. భక్తి, 16. శ్రద్ధ.

అనే ఈ పదహారింటినీ "షోడశ విధ అంతఃకరణ వృత్తులంటారు. వీటినే క్లుప్తంగా చెప్తారు "రాగ ద్వేషాదులు" అని (రాగం ద్వేషం మొదలైనవి అన్నమాట) వీటి వల్ల ప్రేరేపింపబడి మనుష్యుడు కర్మలు చేస్తాడు అంటున్నది శాస్త్రం.

ఈ అంతఃకరణ వృత్తులకు = చిత్తవృత్తుల కన్నింటికీ అసలు కారణమైంది మూలమైంది కామం = కోరిక (desire) గనుక

ఎవరిచేత ప్రేరేపింపబడి మనుష్యుడు పుణ్య పాప మిశ్ర కర్మలు చేస్తాడు అని అర్జునుడు అడిగినప్పుడు భగవంతుడు "కామం" వల్లనే కర్మలు చేస్తాడు. "ఈ కామమే మనుష్యునికి మహా శత్రువు అని బోధించారు."

అధకేన ప్రయుక్తోఽయం పాపంచరతి పూరుషః
(గీ॥ 3_36)

కామఏష క్రోధఏష, రజోగుణ సముద్భవః
మహాశనో మహాపాప్మా, విద్ధ్యే నమిహా వైరిణం.
(గీ॥ 3_37)

అందుచేత అర్జునా.

ఏవంబుద్ధేః పరంబుద్ధ్వా
సంస్థభ్యాత్మాన మాత్మనా
జహిశత్రుం మహాబాహో
కామరూపం దురాసదం.
(గీ॥ 3_43)

V.R. NARLA MEMORIAL

ఆత్మజ్ఞానం (Self realisation) అనే శస్త్రంతో నీకు ప్రబల శత్రువైన "కామం"ను వినాశమొందించు అని భగవంతుడు ఉపదేశించినారు.

కనుక మనచేత నానాకర్మములుచేయించి సంసారంలో దుఃఖమూ, బాధా పొందేటట్లు చేయించే ఆ చిత్తవృత్తులు ఏవో వాటిని తెలుసుకొంటే జాగ్రత్తగా మసలుకోటానికి వీలుంటుంది గదూ? బాగుపడతాం గదూ? అందుచేత విను:

1. రాగం:

ఇంద్రియార్థాలను అంటే మన ఇంద్రియాలకు ఇష్టమైన తినే వాటినీ, తాగేవాటినీ, చూచేవాటినీ ఈ మొదలైనవన్నీ సంపాదించాలి

అనుభవించాలిఅనే కోరిక = ఆశ = ప్రీతి అంటే గృహారామ క్షేత్రవిత్తాదులు, అంటే మేడలు, మిద్దెలు, తోటలు, భూములు, ధనం మొదలైన వాటిని సంపాదించి అనుభవించాలనే చిత్తవృత్తి.

2. ద్వేషం:

మనకు అయిష్టమైన వాళ్ళనూ, వస్తువులనూ దూరంచెయ్యాలి, నాశనం చెయ్యాలి అనే చిత్తవృత్తి. పగసాధించాలనే చిత్తవృత్తి.

3. కామం:

సాధారణంగా అర్థం కోరిక = వాంఛ అని అయినా ముఖ్యంగా పురుషుడికి స్త్రీ విషయమయినది, స్త్రీకి పురుషుని విషయమయినది చిత్తవృత్తి "కామం" అనబడుతున్నది.

4. క్రోధం:

మనకు ఇష్టమైన వస్తువులు సంపాదించటంలో, పొందటంలో అడ్డము వచ్చిన వాళ్ళమీదా, మనకు ఇష్టమైన వస్తువులను హానికలిగించే వాళ్ళమీద, వైరస్యం, కోపం వాళ్ళకు అపకారం చేయాలనేచిత్తవృత్తి.

5. లోభం:

ధనం ఎంతఉన్నా ఇంకా సంపాదించాలనే అత్యాశ. సంపాదించిన దానిలోనుంచి ఒక్కపైసా అయినా ఎంతటి సత్పాత్రునికైనా, మంచి వాడికైనాగాని, మంచిపనికైనా గాని ఈయకుండు చిత్తవృత్తి

6. మోహం:

విపరీతమైన జ్ఞానం (తెలివి) అంటే మంచిదాన్ని చెడ్డగానూ చెడ్డదాన్ని మంచిగానూ, ధర్మాన్ని అధర్మంగాను, అధర్మాన్ని ధర్మం గానూ భావించటం, అందువలన చెడును, అధర్మాన్ని చేయుచిత్తవృత్తి

7. మదం:

నాకు అంగబలం, అర్థబలం మొదలైనవి, అన్ని సంపత్తులు ఉన్నవి. నాకు శక్యంగానిది ఏమున్నది? నాకడ్డు ఎవరు రాగలరు? నేను చేయదలచుకొన్నది చేసేస్తా అనే చిత్తవృత్తి.

8. మాత్సర్యం:

అన్య శుభద్వేషం. అంటే ఇంకొకడు తనకంటే ఏ విషయంలో నైనా, ధనంలోగాని, శక్తిలోగాని, అధికారంలోగాని, వైభవంలోగాని అధికుడై వుంటే సహించలేక పోవటం.

9. ఈర్ష్య:

దుఃఖం ఇంకొకడికి రావాలిగాని నాకెందుకు రావాలి. రాకూడదు. అనే చిత్తవృత్తి.

10, అసూయ:

నాకు కలిగిన ఈ సుఖం వాడికి గూడ ఎందుకు కలగాలి, నేనంటే గొప్పవాడిని. తెలివిగలవాడిని గనుక నాకు సుఖం గలగటం సమంజసమే, వట్టి "ఫూల్" "దేబె" వాడికికూడా నాతో సమానంగా ఈసుఖం ఎందుకూ అనే చిత్తవృత్తి.

11. దంభం:

కీర్తి, ప్రతిష్ట, ప్రసిద్ధి గలిగి, సన్మానాలు, సత్కారాలు, పొందాలని, డంబాచారంతో, దానాలు, ధర్మాలు, యజ్ఞాలు, సత్కార్యాలు, చేయాలనే చిత్తవృత్తి.

12. దర్పం:

నేను సంపద, ఐశ్వర్యం, అధికారం, గలవాడను నాతోసమాను ధేడీ అనే చిత్తవృత్తి.

13. అహంకారం:

దేహమూ, ఇంద్రియాలూ మొదలైన వాటియందు "నేను" అనే చిత్తవృత్తి. దానివలన తన దేహానికి సంబంధించిన సౌందర్యం, బలం సంతానం ఈ మొదలైన వాటియొక్క గొప్పచేత విఱ్ఱవీగుతూ, ఇతరులను బెదరించడం, నిష్ఠురంగా పరుషంగా మాట్లాడటం అనేచిత్తవృత్తి

14. ఇచ్ఛ:

అవర్జనీయ ప్రాశన, విమోచనాది కర్మ చికీర్ష, తప్పని సరిగా చేయవలసిన తినటం, తాగటం, మూత్ర పురీషాలు విసర్జన చేయటంఅనే కర్మలయందు చిత్తవృత్తి.

15, భక్తి:

జననీ జనకులయందు, సద్గురు సత్పురుషులయందు, పరమేశ్వరునందు పరమప్రేమ, వారిని సేవించడం శుభాన్ని కలుగజేస్తుంది అనే చిత్తవృత్తి.

16. శ్రద్ధ:

చిత్తశుద్ధిని కలిగించేవి, నిష్కామంగా చేయబడేవి అయినసత్కర్మల యందునూ, వేదాంత వాక్యముల యందునూ, సద్గురూపదేశమందునూ, దృఢమైన విశ్వాసం, అంటే ఇవన్నీ సత్యములు, వీనికి అనుగుణ్యంగా మనం ప్రవర్తిస్తే మనకు శుభంకలుగుతుంది అనే బుద్ధి నిశ్చయం.

చిత్తశుద్ధిఅంటే ఏమిటోబాగా తెలుసుకోవాలి నాయనా చిత్తం శుద్ధం గావటం అంటే ఏమిటి? మనసులో ఉన్నటువంటి మాలిన్యం, మకిల, జిడ్డు, అశుద్ధత్వం = కోరికలు పోవడమన్నమాట.

ఈ కోరికలు మరి ఎట్లాపోతవి అంటావేమో. పరమేశ్వరారాధనను, ఏమీ అడగకుండా, ఆయనతో బేరాలు ఆడకుండగా నాకు ఈ మంచి కలిగితే నేను నీకు ఇంతధనం సమర్పించి ఇట్లా పూజచేస్తా అనే "కండిషన్ల"తో "షరతుల"తో పరమేశ్వర ఆరాధన చేయకుండా, నిష్కామంగా చిత్తశుద్ధిని గలిగించు తండ్రీ. ప్రహ్లాదుని వలె, ఆంజనేయునివలె కోరికలులేని మనసు గలిగిన వాడనగునట్లు అనుగ్రహించు తండ్రీ అని ప్రార్థిస్తూ ఈశ్వరపూజ, సేవ, భజన, ఆరాధనచేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది.

ఈ పదహారు అంతఃకరణ వృత్తులలో, మొదటి 13 వృత్తులూ (రాగం మొదలుకొని అహంకారంవరకూ) కల మనస్సును అపరిశుద్ధ మనస్సు అనీ, ఆసురసంపదలు కల మనస్సు అనీ, రాక్షస స్వభావము కల మనస్సు అనిన్నీ వీటివలన నీచమైన జన్మలు దేహాలు వస్తవనిన్నీ చివరి 2 భక్తి, శ్రద్ధలుగల మనస్సును పరిశుద్ధ మనస్సు అనీ దైవీసంపదగల మనస్సు అనిన్నీ, వీటివల్ల మంచిజన్మలు, దేహాలువస్తవనిన్నీ కాలక్రమేణ ప్రయత్న ఫలితంగా మోక్షం కలుగుతుందని శాస్త్రాలు చెపుతున్నవి.

మిగిలిన 1, 14వది ఇచ్ఛ.

అంటే జీవించడానికి మాత్రం అంటే పరమ పురుషార్థం అయిన మోక్షాన్ని సంపాదించుకోటానికి, ప్రాణాల్ని రక్షించుకోవాలి గనుక తప్పనిసరిగా ఎంత తినాలో, ఎంత తాగాలో అంతమాత్రమే తింటూ, తాగుతూ, జిహ్వ చాపల్యాన్ని, రకరకాల రుచిగల పదార్థాలనుఎప్పుడూ తింటూ ఉండాలి అనే ఆశను తీసివేసికొని, తప్పనిసరిగా చేయవలసిన, మానశక్యంగాని, మూత్ర పురీషాది విసర్జనం చేయటం ఇచ్ఛ అనబడుతుంది. ఇవి అవశ్యకర్తవ్యాలే గనుక వీటివల్ల మంచీలేదు, చెడూలేదు, పాపంలేదు, పుణ్యంలేదు.

దీనిని గురించి (గీ॥ 7–11) శ్లోకంలో భగవంతుడు ఉపదేశించి నాడు.

ధర్మా విరుద్ధో భూ తేషు
కా మోఽస్మి భరతర్షభ.

( గీ॥ 7-11 )

జీవించడానికి అవశ్యము చేయవలసిన ప్రాశన, విమోచనములు అనే ఇచ్ఛ అది నేను. అని బోధించినారు. అంటే ప్రాణ రక్షణకోసం జీవించి ఉండటానికీ. శాస్త్రానికీ అనుకూలమైన అభ్యాసం చేయటానికి శక్తి కావాలి కనుక దానికి తగినట్లుగా మాత్రం హితమైనది. మితమైనది అయిన ఆహారాన్ని మాత్రం తీసుకోటం అనే నిశ్చయం నాకటాక్షం పొందిన వానికిమాత్రమే కలుగుతుంది. అని పరమేశ్వరుడు ఉపదేశిస్తున్నాడు

# దుఃఖాది సప్తకం

## (4) 2. మనస్సు - అంతఃకరణం

పైన మనం చెప్పుకొన్న (16) వృత్తులు ఎక్కడ ఉంటున్నవి అంటే (10) "ఇంద్రియాలనూ"

(అంటే శ్రోత్ర. త్వక్చక్షుర్జిహ్వాఘ్రాణములు = వినటం, చలి వేడి మొదలైన స్పర్శలను తెలుసుకోటం. చూడటం. రుచి తెలుసుకోటం. వాసన చూడటం. అనే శక్తులుకలవైన జ్ఞానేంద్రియాలు. — వాక్పాణిపాదపాయూపస్థులు = మాట్లాడటం, ఇయ్యటం పుచ్చుకోటం, పోవటం రావటం. పురీషం వదలటం. శుక్లం (Semen), మూత్రం విసర్జించటం అనే శక్తులు కలవైన కర్మేంద్రియాలు)

ఈ ఇంద్రియాలను నియమిస్తూ = కంట్రోల్ చేస్తూ, వాటితో కలిసి, విషయాలను గ్రహిస్తూ, పనులు చేయిస్తూఉంటూ అన్నిటికి మూలమైన అంతఃకరణం = లోపలి పనిముట్టు = "మనస్సునూ" ఆశ్రయించి ఈ వృత్తులన్నీ ఉన్నవి.

ఈ విషయం మన అనుభవంలోనూ ఉన్నది. ఉపనిషత్తులూ, గీత కూడా చెపున్నవి. అదెట్లాగో కొన్ని గీతా వాక్యాల అర్థాన్ని విచారించి తెలుసుకొందాం

(1) ఇంద్రియ స్యేంద్రియ స్యార్థే రాగ ద్వేషావ్యవస్థితౌ (గీ॥ 3-34)

ప్రతి ఇంద్రియానికి దానిచేత అనుభవింపబడే ఇంద్రియార్థము లను గురించి రాగద్వేషాలు, అనుకూలవృత్తి = ఇష్టం. ప్రతికూల వృత్తి = అయిష్టం అన్నవి

(2) "ఇంద్రియాణి మనోబుద్ధిః అస్యాధిష్ఠానముచ్యతే"
(గీ॥ 3-40)

ఈ పదహారు వృత్తులకూ, మూలమైన కామం (Desire) ఇంద్రియాలనూ. మనస్సునూ, బుద్ధిని ఆశ్రయించుకొని ఉన్నది.

ఇట్లా ఈ 16 వృత్తులు ఇంద్రియాలను మనస్సును ఆధారం చేసుకొని, ఆశ్రయించి ఉన్నవి గనుక, రాక్షస స్వభావం అని చెప్పబడే మొదటి 13 వృత్తులనూ బొత్తిగా లేకుండా చేసుకోటానికిన్నీ 15. 16 దైవీ సంపదనబడే భక్తి శ్రద్ధలు అనే వృత్తులను, క్రమ క్రమముగా వృద్ధి పొందించుకొంటూ cent per cent నూటికి నూరు మార్కులు సంపాదించు కోటానికిన్నీ మనుష్య జన్మను మనం అనేక కోట్ల జన్మల నుంచి, పరమేశ్వరుని ప్రార్థించి, ప్రార్థించి మనం చేసుకున్న పుణ్యాన్ని ధారపోసి, సంపాదించుకొన్నాం గనుక మనం ఏం చెయ్యాలంటే

ఈ మనస్సు అనే పరికరాన్ని = పని ముట్టును, శుద్ధం చేసుకోవాలి నాయనా అంటున్నవి. ఉపనిషత్తులు గీత

అదెట్లాగో విచారించి చూచుకుందాం పట్టు. విసుగు చెందవద్దు. ఎందుకూ అంటే, విసుగులేకుండా ఇట్లా విచారం చెయ్యటమే "తపస్సు", "ఆరాధన", భజన "పూజ", "సేవ" అనే పేర్లతో చెప్పబడుతున్నవి నాయనా ఇట్లా నిన్ను బాగుచేసే ఈవిచారంచేసి, ఈవిచార ఫలంగానీ దైనందిన జీవితాన్ని (Daily life) పరిశుద్ధం చేసుకోకుండా, నీవు గుళ్ళుగోపురాలకు పోయినగానీ, వ్రతాలూ, నోములూ చేసినగానీ తీర్థయాత్రలుచేసినా

గానీ, కాశీ రామేశ్వరాలు, బదరీ నారాయణ సందర్శనం చేసినాగానీ లాభం సున్న, బలం, ధనం, కాలం (Energy, Money, Time) అన్నీ పాడుచేసుకోటం తప్ప మరేం లేదంటున్నవి శాస్త్రాలు. అందుచేత, ఓపికతో విచారణచేసి అర్ధం చేసుకోవాలి బాబూ, మనకు శుభంను గలిగించేదాన్ని ఆచరించాలి బాబూ।

(3) "తయోర్న వశమాగచ్ఛేత్
తౌహ్యస్య పరిపంథినౌ"

(గీ॥ 3-34)

ఈ రాగ ద్వేషాదులు, (కామం ≡ కోరికలు) మనుష్య జన్మము సఫలం చేసుకొటానికి ప్రయత్నం చేసే వాడికి, శత్రువులు నాయనా, కనుక వాటికి వశంగావద్దు, గట్టి పురుష ప్రయత్నంచేత వాటిని లేకుండా చేసికొవాలి

(4) పాప్మానం ప్రజహిహ్యేనం జ్ఞాన విజ్ఞాన నాశనం

(గీ॥ 3-41)

నీ తెలివి తేటలను = విచక్షణాశక్తిని = జ్ఞానాన్ని నాశనంచేసే, ఈ కామ రూపమైన పిశాచాన్ని, రాగద్వేషాదులను, అంత మొందించుకోవాలి

(5) జహిశత్రుం మహాబాహో
కామరూపం దురాసదం

(గీ॥ 3-43)

చాలా కష్టపడి, ప్రయత్నం చేస్తేగాని జయించటానికి సాధ్యంగాని, ఈ "కామం" అనే శత్రువును, రాగద్వేషాదులనే శత్రువులను వినాశమొందించు కొవాలి

(6) "ఉద్ధరే దాత్మనాత్మానం
నాత్మాన మవసాదయేత్
ఆత్మైవ హ్యాత్మనోబంధుః
ఆత్మైవ రిపురాత్మనః"

(గీ॥ 6-5)

కామం, రాగద్వేషాదులు వీటిని వదలిపెట్టిన, మనస్సుచేతనే నిన్ను నీవు దుఃఖ సముద్రమైన సంసారంలోనుంచి బయట పడవేసు కొంటావు. అందుచేత, నీ మనస్సును రాగద్వేషాలతో, కామంతో నిండిన దాన్నిగా చేసుకొని, నిన్ను నీవు అధోగతిని పొందించుకోకు నాయన. ఒక నీచమైన జన్మకంటె ఇంకొక నీచమైన జన్మలోకి పోకు రాగద్వేషాదులను, కామాన్ని వదలి పెట్టిన మనస్సే నీకు పరమ బంధువు. రాగద్వేషాదులతో నిండిన మనస్సే నీకు పరమ శత్రువు.

ఈ రాగద్వేషాదులనే అసుర సంపద, రాక్షస సంపదఅనీ, నిన్ను నీచమైన జన్మలను పొందిస్తుంది అనిన్నీ భగవంతుడు 16 వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగయోగంలో ఏం చెప్తున్నారో అది గూడా కొ_స్త చూద్దాం నాయనా. ఎందుకంటే అనేక కోట్ల జన్మల్లో సంపాదించుకొని మనస్సులో దాచిపెట్టుకొన్న ఈ రాక్షస స్వభావం = రాగద్వేషాదులు పోవాలంటే ఎంత విన్నా, ఎంత కన్నా, ఎంత చదివిన, ఎంత ఆలో చించినా తక్కువే. ఎంత ప్రయత్నం చేసిన కుక్కతోక వంకరల్లే ఈ మనస్సు ఆ పాత బాటనే తొక్కుతుంది. చూడు భగవంతుడు ఏమి ఉప దేసిస్తున్నారో.

(7) కామ మాశ్రిత్య దుష్పూరం
దంభమాన మదాన్వితాః
మోహాద్గృహిత్వాఽసద్గ్రాహాన్
ప్రవర్తంతేఽశుచివ్రతాః

(గీ 16 అ 10 శ్లో)

(8) ఆశాపాశ శతైర్బద్ధాః
కామక్రోధ పరాయణాః
ఈహంతే కామభోగార్థం
అన్యాయే నార్థ సంచయాన్.

(గీ 16 అ 12 శ్లో)

(9) ఇదమద్య మయాలబ్ధం
ఇమం ప్రాప్స్యే మనోరథమ్
ఇదమస్తీ దమపి మే
భవిష్యతి పునర్ధనమ్

(గీ 16 అ 13 శ్లో)

(10) అసౌమయాహతఃశత్రుః
హనిష్యే చాపరానపి
ఈశ్వరోఽహమహంభోగీ
సిద్ధోఽహం బలవాన్ సుఖీ

(గీ 16 అ 14 శ్లో)

(11) ఆఢ్యోఽభి జనవానస్మి
కోన్యోఽ స్తి స దృశో మయా
యక్ష్యే దాస్యామి మోదిష్య
ఇత్య జ్ఞాన విమోహితాః
(గీ 16 అ 15 శ్లో)

(12) అహంకారం బలం దర్పం
కామం క్రోధంచ సంశ్రితాః
మామాత్మ పరదేహేషు
ప్రద్విషంతోఽభ్యసూయకాః
(గీ 16 అ 18 శ్లో)

(13) తానహం ద్విషతః క్రూరాన్
సంసారేషు నరాధమాన్
క్షిపామ్యజ స్రమశుభాన్
ఆసురీష్వే వ యోనిషు
(గీ 16 అ 19 శ్లో)

(14) త్రివిధం నరకస్యేదం
ద్వారం నాశన మాత్మనః
కామః క్రోధ స్తథా లోభః
తస్మా దేత త్త్రియంత్య జేత్.
(గీ 16 అ 21 శ్లో)

7. పైన మనం చెప్పుకొన్న దంభం, మదం, అహంకారం మోహం వీటితో నిండిన వాళ్లై హద్దులేని ఆశలూ, కోరికలూ కామం కలిగి, బుద్ధిలేక ఏది శ్రేయస్సును గలిగిస్తుందో తెలుసుకొనే వివేకం లేక "ఈ మంత్రంతో ఈ తంత్రంతో ఈ కానుకలు సమర్పించి, ఈ బలియిచ్చి పూజిస్తే, ఆరాధిస్తే, ఫలాని దేవత సంతోషించి గొప్ప ఐశ్వర్యాన్ని శక్తులను కలిగిస్తుంది." అని నీచమైన విశ్వయాలు గలిగి, కల్లు, సారా, మాంసము వీటిని క్షుద్రమైన తమ ఆరాధ్య దేవతలకు సమర్పిస్తూ అశుద్ధములు, అపవిత్రములు అయిన వ్రతాలు చేసే వారునూ,

(గీ 16 అ 10 శ్లో)

8. అనేకంగా ఆశలు, కోరికలు కలిగి, శబ్దాదులైన విష యాలను భోగించాలి అనే అంతులేని అభిలాష కలిగి, ఈ భోగాలు అనుభవించటానికి ధనం కావాలి గనుక దానిని సంపాదించటానికి, అన్యాయాలు, మోసాలు, దొంగతనాలు చేయటం, అధికార బలంచేత దౌర్జన్యంతో ధనం దోచుకోటం, లంచాలు తీసుకోటం మొదలైన దుర్మార్గాలచేత డబ్బు సంపాదించేవారున్నూ.

(గీ 16 అ 12 శ్లో)

9. ఇప్పుడు నాకు అన్ని బ్యాంకుల్లో కలిసి ఇంత డబ్బుఉన్నది. ఇంకా ఇంత డబ్బు (Income) ఈ వ్యాపారం వల్ల వస్తుంది. ఇప్పటికి మన స్కీముల్లో ఇవి పూర్తి అయినవి. ఇక మిగిలినవికూడా త్వరలోనే నెరవేరతవి అని అన్యాయంగా డబ్బు సంపాదించటం, వాంఛలు పూర్తి చేసుకోటమే పరమ కర్తవ్యంగా తలంచేవారున్నూ.

(గీ 16 అ 13 శ్లో)

10. నా స్కీములకు వాడు అడ్డం వస్తుంటే "వార్నింగు" ఇచ్చాను. కాని వాడు మానలేదు. అందుచేత వాడిని పరలోకానికి పంపించా (మర్డర్ = Murder చేయించాను) ఇంకా ఇద్దరు మిగిలి ఉన్నారు వాళ్ళకు కూడా ఇదే గతి పట్టుతుంది. వీళ్లో లెక్కా నాకు. మన మంటే ఏమిటో ఏం కథో వీళ్ళకు తెలియదు. మనకు ఎంత Influence ఉన్నదీ! ఎంత బలం ఉన్నదీ! ఎంత మంది మనచేతికింద ఉన్నారు. సైగచేస్తే చాలు నిమిషంలో పనిచేసేస్తారు. పోలీసు డిపార్టుమెంటు అంతా మన చేతిలో ఉన్నది. మనమీద కేసుపెట్టేవాడేడీ అని అహంకా రంతో విఱ్ఱవీగే వారున్నూ.

(గీ 16 అ 14 శ్లో)

11. డబ్బంటే మనకు లెక్కట్రా; వెధవడబ్బు, ఊఁ అంటే లక్షలు వచ్చి పడుతవి. మనకు ఎన్ని బిరుదులూ ఎంత పలుకుబడీ. పెద్ద పెద్ద వాళ్ళకు "డిన్నర్లు" "at Home" లు చేస్తూ ఉంటాము, High circles లో "move" అవుతూంటాము. దేనికదే చెడ్డకు చెడ్డే. మంచికి మంచే. యజ్ఞాలు. సమారాధనలు చేస్తాం. దానాలు. ధర్మాలు చేస్తాం. మనతో సమానం అయినవాడు ఏడీ అని తమ రాక్షస కృత్యా లను గురించి తామే గొప్పగా పొగడుకొనే వారున్నూ.

(గీ 16 అ 15 శ్లో)

12. ఇట్లా, సమస్త దుర్గుణాలకు, రాగద్వేషాలకు మూలమైన అహంకారాన్నీ, ఇతరులకు హాని గలిగించే దేహబలాన్నీ, అంగ బలాన్నీ, అర్థ బలాన్నీ, అధర్మాచరణకు పురికొల్పే దర్పాన్నీ, స్త్రీ విషయమైన కామాన్నీ, తమకు అడ్డంవచ్చే వాళ్ళమీద తాచుపామల్లేపగ, క్రోధం వాళ్ళను నాశనం చెయ్యాలనే భావాలను గలిగి, సర్వమునకూ

సాక్షినై, తమ దేహాలలోనూ, ఇతరుల దేహాలలోనూ ఉన్న పరమేశ్వరుడనైన నన్ను ధిక్కరిస్తూ ద్వేషిస్తూ ఉండే అసుర సంపదగల వారున్నూ.

(గీ 16 అ 18 శ్లో)

12 అయిన ఈ నరాధములను, క్రూరులను, దుర్మార్గులను దుష్కర్మ పరులను, వారి వారి పాపకర్మములకు తగినట్లుగా వారికి మళ్ళా మళ్ళా వ్యాఘ్రము, పాము, తేలు, మొదలైన అసుర జన్మలనే కలుగ చేస్తాను. ఈ రీతిగా పోను పోను, వాళ్ళు ఇంకా నీచములైన క్రిమి కీటకాది జన్మలనూ చెట్టూ, చేమ, రాయి రప్ప అనే స్థావర జన్మలనూ పొందుతూ పోతారు.

(గీ 16 అ 19, శ్లో)

14. కాబట్టి నరకానికి ద్వారాలనూ నిన్ను మోక్షం పొందకుండా చేసే పరమ శత్రువులునూ అయిన అసుర సంపద అయిన కామం క్రోధం లోభం అంటే రాగద్వేషాదులను విడిచిపెట్టిన వాడు. తనకు తాను మహాశ్రేయస్సును కలిగించుకొని మోక్షాన్ని పొందటానికి సమర్థుడవుతాడు. (గీ॥ 16 అ॥ 21, 22)

(7) రాగ ద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాదమధిగచ్ఛతి"

(గీ॥ 2-64)

రాగద్వేషాలు లేనటువంటి ఇంద్రియాలు గలిగినవాడై అంటే, తన కంట్రోల్లో ఉన్న ఇంద్రియాలుగలవాడై అనివార్యంగా = తప్పని సరిగా, జీవించడానికిమాత్రం అవసరమైన వస్తువులనుమాత్రం గ్రహించుతూ ఉంటున్నవాడు నిర్మలుడు అవుతాడు. వానిచిత్తం శుద్ధమవుతుంది అని.

(8) కామక్రోధవియుక్తానాం యతీనాంయత చేతసాం
అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనాం.

( గీ॥ 5–26 )

కామం క్రోధం లేనివారునూ అంటేరాగద్వేషాదులు లేనివారునూ, మనస్సును తమ కంట్రోల్లో ఉంచుకొనే శక్తిగలవారునూ అయిన మహాత్ములు తమ నిజస్వరూపాన్ని తెలుసుకొని, అంటే ఆత్మ జ్ఞానాన్ని పొంది, శరీరంతో ఉన్నపుడు జీవన్ముక్తులూ, శరీరం పడిపోయిన తరువాత విదేహముక్తులూ అవుతారు. అంటే మోక్షం పొందుతారు అంటే వాళ్ళకు జన్మ ఉండదు, దేహాలను పొందటం అనే సంసారంనుంచి విడుదల పొందుతారు అనిన్నీ.

అని గీతామాత మాటిమాటికి ఉపదేశిస్తున్నది నాయనా అందుచేత నీ మనస్సును రాగద్వేషాలు లేని దాన్నిగా చేసుకోటానికే మనుష్యుడవై పుట్టావని తెలుసుకొని విసుగూ విరామం లేకుండా, నిరంతరంగా, ప్రయత్నం చెయ్యి. గీతలో ఏ అధ్యాయం చూసినా ఈ మాటే చెప్పబడివున్నది. మరి గీతాభ్యాసం గీతాపారాయణం చేసేనీవు ఈ గీతోపదేశాన్ని నీ జీవితంలో ఆచరణలోకి తెచ్చుకోకుండా కాలంగడిపితే, గీతాపారాయణం చేస్తున్నాగా అనే తృప్తి గలిగివుంటే ఏంలాభం. మహాశ్రేయస్సును పొందడానికి వచ్చిన మనుష్యజన్మను ఎట్లా సఫలం చేసుకొంటావు? పోయినకాలం పోనేపోయింది. అది తిరిగిరాదు. ఇకముందైనా నీ ఆయుష్కాలాన్ని పాడుచేసుకోకుండా గీతోపదేశాన్ని నీనిత్య జీవితంలో ఆచరణలో పెట్టడానికిపూనుకో. పూర్వపు చెడ్డఅలవాట్లవలన ఈ పని నీచేతగాకుంటే శక్తిని ప్రసాదించుమని పరమేశ్వరుణ్ణి పరితాపంతో, ప్రతిదినమూ ప్రార్థించు నాయనా. ఇదే నీవుచేయవలసిన పని.

దీనిని వదలి నీవు ఇంకేంచేసినా, ఎక్కడకుపోయినా, ఎవరిని చూచినా ఏ తీర్థయాత్రచేసినా, ఏమంత్రం జపించినా లాభంలేదు అంటున్నవి ఉప నిషత్తులన్నీగూడా.

ఆ ఉపనిషత్తులలోని వాక్యాలనుగూడా కొన్ని తెలుసుకొందాంపట్టు. అసలు మనస్సు అంటే

మనః = మనుతే బ్రహ్మ అనేనేతి మనః; సర్వత్ర సదసలోక నకారణం.

బ్రహ్మము = పరమాత్మ = పరమేశ్వర తత్త్వం దీనిచేతమననం చేయబడటంచేతనున్నూ.

సర్వత్ర సదవలోక నకారణం = అంతటా సత్యమైన బ్రహ్మమే ఉన్నదనీ, అసత్యమైన జగత్తు లేనేలేదనిన్నీ, ఈ రీతిగా పరమార్థ దర్శనం చేయటానికి కారణం = మేలైన పనిముట్టు గనుకనున్నూ దీనిని మనస్సు అంటారు.

ఇది అసలు నిర్మలమైందేగాని, రాగద్వేషాల సంపర్కంతో దీనికి అశుద్ధత్వం కలుగుతున్నది. ఈ రాగద్వేషాదులవల్లనే నీచమైన జన్మలు వస్తున్నవనీ దుఃఖం, బాధతో కూడుకొన్న సంసారం కలుగు తున్నది అని శాస్త్రం బోధిస్తున్నది.

నీవు తినే ఆహారంలో (1) స్థూల భాగం "పురీషంగా" మారి బయటికి పోతున్నది (2) సూక్ష్మ భాగం "మాంసంగా" మారి నీ దేహాన్ని వృద్ధిపొందిస్తున్నది. (3) అతి సూక్ష్మభాగం "మనసు" ను వృద్ధి పొందిస్తూ విషయాలను గ్రహించటం. ఆలోచించటం, మంచీ చెడ్డా, విచారణ చేయటం అనే పనులు చేస్తున్నది.

కనుక నీవు తినే ఆహారానికి నీ మనస్సుకూ ఎంత సంబంధం ఉన్నదో తెలుసుకో, నీతి, నియమంలేకుండా అపరి శుద్ధమైనదీ, హోట

శ్ళలోనూ, అక్కడా, ఇక్కడా, విక్రయం చేయబడే = అమ్మబడే వండిన పదార్థాలను, ఈశ్వరునకు నివేదనచేయని పదార్థాలను, తింటే నీ "మనస్సు" అపరిశుద్ధంగానే తయారు అవుతుంది. దుష్టమైన ఆలోచనలు చేస్తూ నీచేత చెడ్డ పనులను, రాక్షస కృత్యాలను చేయిస్తుంది పాప కర్మలు చేయించి నీకు నీచమైన జన్మలను పొందిస్తుంది.

ఈ మాటను గీత ఎట్లా బోధిస్తున్నదో చూడు.

(9) "యజ్ఞశిష్టాశినః సంతో
ముచ్యంతే సర్వకిల్బిషైః
భుంజతే తేత్వఘం పాపా
యేపచంతి ఆత్మకారణాత్
(గీ॥ 3_13)

ఎవరు పరమేశ్వరునకు నివేదన చేయబడిన అన్నం మొదలైన ఆహార పదార్థాలను తింటారో వారి మనస్సు శుద్ధమవుతుంది. వారు పాపములనుంచి విముక్తులవుతారు. అట్లాగాకుండా ఎవరు తమ కోసమే వండుకొని, పరమేశ్వరునకు నివేదన చేయకుండా, తింటారో, వారు పాపాన్నే తింటున్నారు. అందుచేత

యదశ్నాసి.........తత్కురుష్వమదర్పణం"
(గీ॥ 9_27)

న్యాయార్జితమూ పరిశుద్ధమూ అయిన ఏ అన్నం మొదలైనవాటిని తింటావో వాటిని నాకు సమర్పించుము. అని భగవంతుడు ఉపదేశిస్తున్నారు.

(10) "యత్పురుషో మనసాఽభిగచ్ఛతి,
తద్వాచావదతి తత్కర్మణాకరోతి
(నృసింహతాపిని॥ ఉ॥)

ప్రతివాడూ, ప్రతివిషయాన్ని మొదట మనస్సుచేత గ్రహిస్తాడు. ఆలోచిస్తాడు, మనస్సుచేత గ్రహించిన దాన్ని వాక్కుతో మాటలతో చెప్తాడు. చెప్పిన దానిని క్రియచేత, కరచరణాలతో చేస్తాడు

అని విశదీకరిస్తున్నది నృసింహతాపిని ఉపనిషత్తు

ఈ మాటలను బాగా అర్థం చేసుకోవాలి సుమా. మనందరం ఏ మనుకుంటాం అంటే "మనస్సే విషయాలను గ్రహిస్తుందని - ఆలోచిస్తుందని. మనస్సే మనం" అనుకుంటాం గదూ.

ఇది తప్పుడు అభిప్రాయం నాయనా, ఆలోచించే వాడివి గ్రహించే వాడివి. జ్ఞాన స్వరూపుడవు, చిత్స్వరూపుడవు, తెలివిగలవాడవు - చేతనుడవు అయిన జీవాత్మవు నీవు వేరే లోపల ఉన్నావు. ఆ నీవు మనస్సు అనే పనిముట్టుతో మనస్సు ద్వారా ఆలోచించే పని లేదా తెలుసుకొనే పని చేస్తావేగాని, స్వయంగా మనస్సు అనేది ఏమీ చేయలేదు. అదిజడం అంటే కుండ, గోడ మొదలైన వాటివలె మొద్దు అన్నమాట. పరికరమైన దానితో దాని ద్వారా మంచీ చెడ్డా ఆలోచనలు చేస్తున్నావు. అదీ అసలు సత్యం.

కనుక ఈ మనస్సు అనే పరికరాన్ని, పనిముట్టును ఎంతశుద్ధం చేసుకొంటే అంతశుద్ధమైన ఆలోచనలు, తెలివి గలుగతవి ఇట్లా తనకంటే మనస్సు వేరనేమాట అదిఒకపరికరం అనేమాట నిజాన్ని తెలుసుకోవాలని బాగాబాగా విచారంచేసే వాడికి ఎవడికో ఒకడికితప్ప తక్కిన నాశిరకం వాళ్ళకు తినటంతోను. తాగటంతోను నిద్రపోవటంతోను కాలహరణం చేసుకొనే వాళ్ళకు తెలియదని అంటున్నవి ఉపనిషత్తులు, గీత.

(11) మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతిసిద్ధయే
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః

వేల మంది మనుష్యుల్లో. ఏ ఒక్కడో, పూర్వ జన్మల్లో నిష్కామంగా చేసిన పుణ్య కర్మలయొక్క ఫలంగా శుద్ధమైన మనస్సుగలవాడై విచారం చేసే శక్తి కలవాడై ఆత్మజ్ఞానాన్ని = తాను మనస్సు ఇంద్రియాలకంటే వేరైన "ఆత్మ" అనే తన నిజస్వరూపాన్ని తెలుసుకోటానికి. ప్రయత్నం చేసి చేసి. ఆత్మ పరమాత్మల యొక్క నిజతత్త్వాన్ని తెలుసు కొంటాడు

అని ఆత్మజ్ఞానం యొక్క గొప్పతనాన్నీ దుఃఖం పోగొట్టుకోటానికి అది ఒక్కటే మార్గం నాయనా అనిన్నీ గీత బోధిస్తున్నది.

ఇట్లా మనస్సువేరు. నీవువేరు అనేమాట అర్థంగావటానికి శాస్త్రం దృష్టాంతం చెప్తున్నది చూడు.

ప్రమిదలో మాలిన్యంతో గలిపిన చిన్నవత్తివేసి మడ్డి నూనె పోసి వెలిగించావు. దానిపేరు "చిన్నదీపం" అంటావు. కొంచెమే కాంతినిస్తున్నది అంటావు.

"పెట్రోమాక్సు లైటు" అని ఇంకొకదానికి పేరుపెట్టావు. ఇది చాలా కాంతినిస్తున్నది అంటావు.

అసలు ఈ రెంటిలోనుగూడా కాంతినిచ్చేది ఏది. అగ్ని గదూ. ఆ అగ్నికి ఒకప్పుడు కొంచెంకాంతివుండి ఒకప్పుడు చాలాకాంతి వుంటుందా? అగ్నికి ఎప్పుడూ ఒకేవిధంగా కాంతివుంటుంది. అయితే ఈ కొంచెం కాంతి చాలా కాంతి అనే వాడుక ఎట్లావచ్చింది అంటే ఆ అగ్ని ఒకటైనా ఆ అగ్ని మంచినూనెను మంచి పెద్దవత్తినీ ఆశ్రయించి చాలా కాంతిని ఇస్తున్నది. చెడ్డనూనెను చిన్నది చెడ్డదీ అయిన వత్తిని ఆశ్ర

యించి తక్కువ కాంతిని ఇస్తున్నది. అనే అసలు విషయాన్ని మరచి పోయి మనము మాట్లాడుతుంటాము.

అంటే మంచి పరికరాలు, పనిముట్లను ఆశ్రయించి చాలాకాంతినీ చెడ్డ పనిముట్లను ఆశ్రయించి తక్కువ కాంతినీ ఇస్తున్నదే గాని, అన్ని దీపాలలో ఉన్న అగ్ని ఒక్కటే అనీ దానిలోవుండే కాంతి ఎప్పుడు ఎక్కువ తక్కువలు కాకుండా ఒక్కరీతిగానే ఉన్నది అవన్నీ మనం పై విధంగా విచారిస్తేగాని తెలియదుగదూ.

అట్లాగే అగ్నితో పోల్చదగిన జీవుడున్నాడే వాడుఅగ్నివలెఅన్ని దేహాలలో ఒక్కడే అయిఉన్నాడు. ఒక్కరీతి జ్ఞానమే గలిగి సమంగా ప్రకాశించేవాడై ఉన్నాడు. ఈమాటనే గీత చెపుతున్నది.

"క్షేత్రజ్ఞంచాపి మాంవిద్ధి సర్వక్షేత్రేషు భారత"

( గీ॥ 13-2 )

అన్ని దేహాలలో వున్న క్షేత్రజ్ఞుణి జీవాత్మను ఒక్కడనూ, పర మాత్మనూ అయిననేనే అర్జునా అని భగవంతుడు ఉపదేశిస్తున్నాడు.

సత్యం ఇదే అయినా అగ్ని ఆశ్రయించిన నూనె, వత్తి అనే పరికరాలతో పోల్చదగిన వివిధాలైన "కర్మలు" అనే చెడ్డనూనె.మంచి నూనె, అనేదాన్ని వివిధాలైన మనస్సులు అనే మంచి పెద్దవత్తులనూ, చెడ్డ చిన్నవత్తులనూ ఆశ్రయించి, కొన్ని మంచి మనస్సులతోగూడి మంచి ఆలోచనలనూ, కొన్ని చెడ్డ మనస్సులతోగూడి చెడ్డ ఆలోచన లనూ చేస్తూ మంచివాడు, చెడ్డవాడు అనే అబద్ధమైన పేర్లను తెచ్చు కుంటున్నాడు.

కనుక జీవాత్మవు అయిన నీవు వేరు, మనస్సు వేరు. చెడ్డకర్మల వల్ల చెడ్డమనస్సును సంపాదించుకొని దానితోకూడి చెడ్డ ఆలోచనలు, చెడ్డ మాటలు, చెడ్డపనులుచేసి, రాక్షస వృత్తిగలవాడవై దుర్మార్గుడు

అనిపించుకుంటావు. మంచి మనస్సుతోచేరి మంచి ఆలోచనలుచేసి, మంచిపనులుచేసి సన్మార్గుడు అనిపించుకుంటావు.

కనుక మనస్సు అనే నీ పరికరాన్ని పనిముట్టును బాగుచేసుకో నాయనా అంటున్నది—నృసింహ తాపిని ఉపనిషత్తు.

(12) మన ఏవమనుష్యాణాం కారణం బంధమోక్షయోః
బంధాయ విషయాసక్తం ముక్త్యైనిర్విషయంస్మృతం॥
(బ్రహ్మబిందు ఉ॥ 2)

మనస్సే మనుష్యులయొక్క బంధమోక్షములకు హేతువు.

"విషినోతి బధ్నాతీతి విషయం"

బంధించునది కనుక విషయము—

శబ్ద స్పర్శ రూపాదులందు అంటే ఈ మనస్సు శబ్దాలను వినాలని. స్పర్శ సౌఖ్యం అనుభవించాలని రూపాలను చూడాలని, రుచులను అనుభవించాలని, మంచి వాసనలను అనుభవించాలనీ ఆసక్తి, కోరికలు గలిగి ఉన్నంతవరకు నిన్ను సంసారానికి బంధిస్తుంది, ఒకదేహం పోయిన తర్వాత ఇంకొక దేహాన్ని గలిగించి నీకుదుఃఖం గలిగిస్తుంది.

విషయాలనుండి విముఖమైన మనస్సు విషయాలనుండి తొలగి ఆత్మతత్వాన్ని విచారించే మనస్సు మోక్షాన్ని కలుగజేస్తుంది.

కనుక మనస్సును శబ్దాదులయందు తగుల్కొనకుండా రాగద్వేషాదులులేకుండ, చేసుకొని శుద్ధంగా ఉంచుకోవాలి. ముక్తి కావాలంటే వేరుమార్గంలేదు అని బోధిస్తున్నది బ్రహ్మబిందు ఉపనిషత్తు.

బంధం అంటేను సంసారం అంటేను ఏమో తెలుసుకొందాంపట్టు

(13) 1. అనాద్యవిద్యా వాసనయా జాతో౽హమిత్యాది
సంకల్పో బంధః

2, పితృమాతృ సహోదర దారాపత్యగృహా
రామక్షేత్రాది మమతా సంసారావరణ సంకల్పో
బంధః

3. కర్తృత్వాద్యహంకార సంకల్పో బంధః
4. అణిమాద్యష్టైశ్వర్యాశాసిద్ధ సంకల్పో బంధః,
5. దేవమనుష్యాద్యుపాసనా కామసంకల్పో బంధః
6. సంకల్పమాత్ర సంభవో బంధః

(నిరాలంబ ఉ॥ 30)

(1) అనాదియైన అజ్ఞానంచేత నేను పుట్టాను. నాకు జబ్బు చేసింది. నేను చచ్చిపోతాను" అనే ఈ మొదలైన సంకల్పాలు (మనో వ్యాపారం) "బంధం" అనబడుతుంది.

(2) తండ్రి, తల్లి, అన్న, తమ్ముడు, భార్య, బిడ్డలు, ఇళ్ళు, తోటలు, భూములు మొదలైన వానియందు "నావి" అనెడి అజ్ఞానంచేత గలిగే సంకల్పం "బంధం" అనబడుతుంది,

(3) ఈ దేహమేనేను, నేను చేసేవాడివి అనుభవించే వాడివి అను ఈ మొదలైన కర్తృత్వాది సంకల్పం "బంధం" అనబడుతుంది.

(4) అణిమాదులు అనబడే ఎనిమిది (8) సిద్ధులు నేను పొందాలి అనే కోరిక = సంకల్పం "బంధం" అనబడుతుంది (అణిమాది సిద్ధులంటే చీమ దోమ కంటె ఇంకా సూక్ష్మమైన దేహం పొందేశక్తి, కొండ కంటె పెద్దదైన దేహాన్ని పొందటం, అనే శక్తి దేనిని పొంద

దలుచుకొంటే దాన్ని పొందగలగటం. అనేక శక్తి, ఇట్లాంటి ఇతర శక్తులు గలిగి ఉండటం)

(5) కోరికలు పూర్తి గావటానికి దేవతలను ఉపాసించాలి, మనుష్యులను (గొప్ప వాళ్ళను) ఆశ్రయించాలి అనే కోరిక = సంకల్పం "బంధం" అనబడుతుంది

(6) ఈరీతిగ నానావిధ సంకల్పాలే "బంధము" అనబడు తుంది

అసలు సంకల్పం అంటే ఏమిటో "సంకల్ప" శబ్దానికి నిర్వ చనం ఏమిటో తెలుసుకుందాం.

అధిష్ఠానాజ్ఞానదోషేణ
శుక్తౌరజత ప్రత్యయవత్
నిర్విశేషే, పరేబ్రహ్మణి, అద్వితీయే
ఘటః, పటః, కుడ్యమితి భ్రాంత్యా
సమ్యక్కల్ప్యంత ఇతి సంకల్పాః
విపరీత ప్రత్యయాః

అంటే

ఏకమై అద్వితీయమై, రెండవది లేనిదైన పరబ్రహ్మమునందు = స్వస్వరూప మునందు = తనయందు, భ్రాంతిచేత = పొరపాటుచేత, ముత్తెపు చిప్ప యందు వెండి అని కలిగే జ్ఞానంవలె (మసక చీకటిలో తాడునుచూచి, పాముఅని పొరపాటుచేత అనుకున్నట్లు) ఇది కుండ, ఇది బట్ట, ఇది దేహం, ఇది కన్ను, ఇది చెవ్వు, ఇది మనస్సు, అని లేని పదార్థాలు అజ్ఞానంచేత స్థిరంగా = బాగుగా = విడువశక్యంగానట్లుగా

కల్పింపబడేవి గాబట్టి "సంకల్పాలు" = అంటే విపరీత భావనలు అన్నమాట. అసత్యమైన భావాలు అన్నమాట

అట్టి అసత్య భావనలే = సంకల్పాలే బంధం (సంసారానికి కట్టు బడటం) అనబడుతుంది మరి మోక్షం (విడుదల) ఏమిటి అంటే

(14) సమస్తబంధ సంకల్పక్షయో మోక్షః

(నిరాలంబ ఉపనిషత్ 3 )

పైన చెప్పబడిన సమస్త సంకల్పాలు. మనో వ్యాపారాలులేనట్టి పరిస్థితే మోక్షం అంతేగాని. ఏ దేవత దగ్గరకుగాని ఏ లోకానికిగాని పోవటంగాదు.

అని నిరాలంబ ఉపనిషత్తు చెప్తున్నది.

(15) "స్వసంకల్పవశాద్బద్ధో
నిస్సంకల్పాద్విముచ్యతే

(మహా ఉపనిషత్ 2-20)

మనుష్యుడు తన సంకల్పాలచేతనే బద్ధుడునూ ఆసంకల్పాలు లేకుండా పోతే. విముక్తుడును = మోక్షము పొందిన వాడునూ అవుతాడు "మోక్షము" అంటే ఇదే

అంటున్నది మహా ఉపనిషత్తు

(16) ద్వేపదే బంధ మోక్షాయ నిర్మమేతి మమేతిచ
మమేతి బధ్యతే జంతుః నిర్మమేతి విముచ్యతే

(మహా॥ ఉ॥ 4 వ.అ)

(17) మమత్వేన భవేజ్జీవో.
నిర్మమత్వే నకేవలః
(యోగచూడా మణి॥ ఉ॥ 84)

(1) ఆత్మయొక్క అగ్రహణము: అంటే తన నిజస్వరూపం తెలిసికోక పోవటం వల్లా పైగా

(2) ఆత్మయొక్క అన్యథాగ్రహణం వల్లా (తనను ఇంకో విధంగా అంటే తప్పుగా గ్రహించటం వల్ల) = దేహాదులేతానని భావించటంవల్ల, ఈ రెండింటివల్ల "నాది, నావి" అనే మమత్వం మనుష్యుడికి వచ్చి పట్టుకొంటున్నది.

ఈ మమత్వంచేత, జీవుడు = దుఃఖాన్ని అనుభవించు వాడు అవుతున్నాడనిన్నీ

తన నిజస్వరూపమైన ఆత్మను తెలిసి కోటంవల్ల దేహాదుల యందు నాది, నావి అనే మమత్వంపోయి నిర్మమత్వం గలుగుతుంది దానివల్ల ఈ జీవుడని చెప్పబడే వాడే పరమాత్మ అవుతున్నాడు. అంటే మనస్సులోని, రాగద్వేషాలను అంటే సంకల్పాలను "సున్న" చేసుకోవాలని అంటున్నది యోగ చూడామణి ఉపనిషత్తు

(18) చిత్తమేవహి సంసారః
తత్ప్రయత్నేన శోధయేత్
(మైత్రాయణ ఉపనిషత్ 4-3)

మనస్సులో ఉండే రాగద్వేషాలే సంసారం వేరేఏమీ లేదు అందు వలన, చిత్తమును పరిశుద్ధం చేసుకోవాలి, రాగద్వేషాదులు = కోరికలు లేనిదాన్నిగా, సంకల్పాలు లేనిదాన్నిగా చేసుకోవాలి.

అంటున్నది మైత్రాయణ ఉపనిషత్తు

(19) పరమశాంతిం స్వీకృత్య మనః ప్రచార
శూన్యం పరమాత్మని, లీనంభవతి
(మండల బ్రాహ్మణ ఉపనిషత్తు శివ బ్రా)

పరమమైన శాంతిని = సకల ద్వైతని వృత్తిని అంటే తనఆత్మ కంటే రెండవ పదార్థము లేదు అనే నిశ్చయాన్ని పొంది మనస్సుప్రచార శూన్యమై, పరి పరి విధాల పరిగెత్తటాన్ని మానేస్తే లవణము (ఉప్పు రాయి) జలంలో లీనమై కరిగిపోయి తన స్వరూపాన్ని విడిచి జలమే ఎట్లాఅయిపోతుందో, అట్లా పరమాత్మలో, మనస్సు లీనమై పోతుంది.

అంటున్నది మండల బ్రాహ్మణ ఉపనిషత్తు

(20) యదాపర్వే ప్రముచ్యంతే
కామాయే ఽ స్య హృదిశ్రితాః
అథమర్త్యో ఽ మృతోభవతి
అత్ర బ్రహ్మ సమశ్నుతే
(బృ.ఉ. 4-4-7) (కఠ ఉ. 2-3-14)

ఎప్పుడు మనస్సును ఆశ్రయించి యున్న సమస్తములైన ఇహ లోక, పరలోక భోగములు అనుభవించాలి అనే కోరికలన్నీ విడచి పోతయో అప్పుడు నిష్కాముడైన మనుష్యుడు మరణములేనివాడై జీవన్ముక్తుడై, వేరే చోటికి, ఎక్కడికి పోకుండానే, ఈ శరీరమందే, పరమాత్మను పొందుతున్నాడు, పరమానంద రూపుడు అవుతున్నాడు. అంటే జీవన్ముక్తుడు అవుతున్నాడు

అంటున్నవి బృహదారణ్యక, కఠోపనిషత్తులు

(21) సంసారో మన సాపుంసః
కల్పితో౽స్తి నవస్తుతః
మనశ్శూన్యే సుషు ప్త్యాదౌ
సంసారో నైవ దృశ్యతే

మనుష్యుని యొక్క దేహేంద్రియాది సంసారం మనస్సుచేతనే కల్పింపబడు తున్నది. అంతేగాని వాస్తవంగా లేదు.

మనస్సు లేకుండా చేసుకొన్నామా, అంటే సంకల్పాలు లేకుండా చేసుకొన్నామా సంసారం లేకుండా పోతుంది

ఈ మాటనిజం అని మనకు అనుభవంలో ఉందిగూడాను. చూడు.

మనస్సు పనిచేసే. జాగ్రత్ స్వప్నావస్థలలో శరీరాదిసంసారం = సుఖదుఃఖాలు అనుభవించటం అనే సంసారం ఉంటుందిగాని. నిద్రావస్థలోనూ, సమాధి అవస్థలోనూ మనస్సులేక పోవటంవల్ల విషయ చింతన లేకపోవటంవల్ల.

శరీరం సంసారం లేకపోవటం అందరికి ప్రసిద్ధమైయ్యే ఉంది గదూ. అనుభవంలో వుందిగదూ,

అందుచేత మానవుని ప్రథమ కర్తవ్యం ఏమిటని తేలిందయ్యా అంటే.

(21) యతో నిర్విషయ స్యాస్యమన సోము క్తిరిష్యతే
తస్మాన్నిర్విషయంనిత్యం మనఃకార్యం ముముక్షుణా
(అమృతబిందు ఉపనిషత్ 3)

మనస్సుయొక్క నిర్విషయత్వమే = కోరికలు లేకుండుటమే "ముక్తి" యనిచెప్పబడుచున్నది కాబట్టి ముముక్షువు అయినవాడు, ఏం చెయ్యాలంటే.

మనస్సును నిర్విషయం చేసుకోవాలి.

అంటే కోరికలులేని దానిగా చేసుకోవాలి.

అంతేకాని ఆ దేవతకు ఈ దేవతకు పూజలుచేస్తూ, వ్రతాలు పట్టుతూ నోములునోస్తూ నాకది ఇయ్యి ఇదిఇయ్యి అని బిచ్చంయెత్తటం ఆ కోరికపూర్తిచెయ్యి ఈ కోరిక పూర్తిచెయ్యి అని ప్రార్థించటం అనే దౌర్భాగ్యాన్ని పోగొట్టుకోవాలి నాయనా జాగ్రత్తగా ఆలోచించుకో.

ఈ విషయాన్నే గీతకూడ చెప్పుచున్నది చూడు.

(22) యతతో హ్యాపికౌంతేయ పురుషస్య విపశ్చితః
ఇంద్రియాణి ప్రమాథీ నిహరంతి ప్రసభం మనః
(గీ॥ 2–60)

(23) తాని సర్వాణి సంయమ్యా యుక్త ఆసీత మత్పరః
వశేహియస్యేంద్రియాణి తస్యప్రజ్ఞా ప్రతిష్ఠితా.
(గీ॥ 2-61)

నిరంతరాభ్యాసంచేత, ఆత్మ తత్త్వజ్ఞానం కొరకు = ముక్తి కొరకు ప్రయత్నంచేస్తూన్నవాడి మనస్సునుగూడా అంటే శబ్దాది విషయాలన్నీ మాయరా, అబద్ధంరా. సంసారంలో కట్టి పడవేస్తవిరాఅని మాటి మాటికి విచారంచేసి నందువలన బాగా తెలిసినవాడి మనస్సునుగూడా, విషయాలను చూచినంత మాత్రంచేతనే సంక్షోభం గలిగించునట్టి = అనుభవించి ఆనందించుదాం అనే కోరికను పుట్టించే ఇంద్రియాలు, బలాత్కారంగా లాక్కుపోయి విషయాలు అనుభవించేటట్లు చేస్తవి కాబట్టి.

అట్టి ఇంద్రియాలను అణచిబెట్టి, వశంలో వుంచుకొని, మనస్సును కంట్రోల్లో వుంచుకోవాలి. పరమాత్మ తత్త్వాన్ని విచారించాలి.

(24) సంకల్ప ప్రభవాన్ కామాం స్త్యక్త్వా సర్వానశేషతః
మనసై వేన్ద్రియగ్రామం వినియమ్య సమన్తతః
(గీ॥ 6-24)

(25) శనై శ్శనై రు పరమేద్బుద్ధ్యాధృతి గృహీతయా
ఆత్మ సంస్థం మనఃకృత్వా నకించి దపిచి న్తయేత్
(గీ॥ 6-25)

(26) యతోయతో నిశ్చరతి మనశ్చంచల మస్థిరం
తత స్తతో నియమ్యైత దాత్మన్యేవవశం నయేత్.
(గీ॥ 6-26)

(27) ప్రశాంత మన సంహ్యేనం యోగినం సుఖము త్తమం
ఉపైతి శాన్తరజసం బ్రహ్మభూత మకల్మషం.
(గీ॥ 6-27)

(1) సంకల్పంవల్ల పుట్టే కోరికలనన్నిటిని తొక్కబట్టి = విడిచి పెట్టి ఇంద్రియాల నన్నింటిని కంట్రోల్లో ఉంచుకుంటూ (2), (3) ధైర్యంగల బుద్ధితో, చంచలమూ, అస్థిరమూ అంటే ఒక్కక్షణంగూడా అటూఇటూ పోకుండా ఉండని మనస్సు ఏఏ విషయాలమీదికి, ఇష్టవస్తువులూ, అనుభవాలూ వీటిమీదకుపోయి పాతవాటిని గురించి చింతించడం కొత్తవాటిని కోరటం అనే వ్యాపారం చేస్తూంటుందో వాటినుంచి లాగుకొచ్చి ఆత్మయందు, నిజస్వరూప విచారమందు స్థిర గా ఉంచడం అనే అభ్యాసం చేయాలి అంటే ఆత్మకంటే మరివేరు ఏమీలేదు అనే స్థిర భావంమీద వుంచడమనేయోగాన్ని. ధ్యానాన్ని, తపస్సును, పూజను.

సేవను అభ్యాసం చేయవోయి నాయనా (4) అట్లాచేస్తే పరమానందాన్ని పొందుతావనీ.

(28) "అభ్యాసేనతు కౌంతేయ వైరాగ్యేణ చగృహ్యతే"
(గీ॥ 6_35)

(29) అభ్యాస యోగయుక్తేన చేతసానాన్య గామినా
పరమం పురుషం దివ్యం యాతిపార్థా నుచింతయన్.
(గీ॥ 8_8)

(30) అభ్యాసయోగేనతతో మామిచ్ఛాప్తుం ధనంజయ.
(గీ॥ 12_9)

అట్లా అభ్యాసంచేస్తే సమస్త దుఃఖంపోయి నీవు ఏ పరమసుఖం కోసం ప్రయత్నం చేస్తున్నావో అది వస్తుంది అనిన్నీ బోధిస్తున్నది గీత.

ఇప్పుడు విచారించి చూసుకో. భగవద్గీత అంటే ఎంతటిపెన్నిధో మేలిమి బంగారం ముక్కల రాశిగదూ. వజ్రవైడూర్యాల గనిగదూ. అమృత సముద్రంగదూ. అసారమై, అపారమై దుర్భరమై,దుస్తరమై, దురిత నిలయమై, దుఃఖ భూయిష్ఠమై,దురంత మైన సంసార పారావారం లోనుంచి నీవు విముక్తిని పొందటానికి నీవు ఏం చెయ్యాలో సందేహానికి తావులేకుండా మార్గాన్ని బోధిస్తున్నదిగదూ.

అందుచేత అబ్బాయీ, నీపాత అలవాట్లు అనే దయ్యానికి బానిసవై వాళ్ళనూ వీళ్ళనూ, ఆశ్రయిస్తూ, ఆ దేవతలకు, ఈ దేవతలకు మొక్కి, ముడుపులుకడుతూ వ్రతాలు చెయ్యలేక, కానుకలు చెల్లించలేక సతమత మవుతూ, చేయవలసినపని మానేసి, చేయకూడని దాన్నిచేస్తూ కాలాన్ని పాడుచేసుకోకుండా.

బహుజన్మార్జిత పుణ్యవిశేషంచేత సంపాదించుకొన్న మనుష్య జన్మను, ముక్తిని పొందటానికి వినియోగం చెయ్యవోయినాయనా ఈ నాడే కంకణం కట్టుకో, వారాలు, వర్జాలు, రాహుకాలాలు, కేతుకాలాలు, తిధి వార నక్షత్రాలు, మీనమేషాలు, లెక్కబెట్టుతూ కూర్చోవద్దు. ఈ దినమే ఈ నిమిషమే అభ్యాసం మొదలుపెట్టు. పరమేశ్వరానుగ్రహం పొందుతావు సత్యం ముమ్మాటికి సత్యం అంటున్నది భగవద్గీత కనుక బాబూ,

(i) భగవద్గీతను నిత్యమూ చదవాలి

(ii) భగవద్గీతను కంఠస్థం చెయ్యాలి

(iii) భగవద్గీతలోని శ్లోకాల అర్థాన్ని మనస్సుకు పట్టించుకొనే శక్తిని సంపాదించాలి.

(iv) భగవద్గీతోపదేశాన్ని నిత్యజీవితంలో ఆచరణలో పెట్టాలి.

(v) అట్లా ఆచరణలో పెట్టటం చేతగాకపోతే శక్తిని ప్రసాదించుమా తండ్రీ అని ప్రతిదినమూ, పరితాపంతో, పరమేశ్వరుని ప్రార్థించాలి.

(vi) ఇది లక్ష్యంగా పెట్టుకొని, నిత్యమూ నిరంతరంగా నిర్విరామంగా, విసుగూ వేసటాలేకుండా, ఆదరణతో శ్రద్ధాభక్తులతో, మళ్ళీమళ్ళీ ప్రయత్నం చెయ్యాలి. దీనినే "అభ్యాసం" "తపస్సు" అంటారు నాయనా.

(vii) ఇట్లా అభ్యాసంచేస్తే "జీవన్ముక్తి", విదేహముక్తి గలుగుతుంది అనే విశ్వాసాన్ని పెంపొందించుకో నాయనా.

పరమేశ్వర కటాక్షానికి పాత్రుడవగుదువుగాక.

ఓం గీతామృత మహోదధయేనమః

ఓం

కృష్ణానందముకుందమురారే, వామన మాధవగోవింద
శ్రీధరకేశవ రాఘవ విష్ణో శ్రీనారాయణ చిద్రూప
యదక్షర పదభ్రష్టం మాత్రాహీనంచయద్భవేత్
తత్సర్వం క్షమ్యతాం దేవ. శ్రీ కేశవనమోఽస్తుతే

వాసుదేవ నమోఽస్తుతే
నారాయణ నమోఽస్తుతే

ఓం

నమోభగవతే వాసుదేవాయ
నమః పురుషోత్తమాయ,
నమస్సర్వ లోకగురవే
నమస్సర్వ లోకపిత్రే
నమస్సర్వ లోకపితామహాయ
నమస్సర్వలోక ప్రపితామహాయ
నమస్సర్వ లోక ప్రధానాయ
నమస్సర్వ లోకేశ్వరాయ.
నమస్సర్వ లోక విశిష్టాయ
నమస్సర్వ లోక సుఖ ప్రదాయ.
నమస్సర్వ లోక కర్త్రే
నమస్సర్వ లోక భర్త్రే
నమస్సర్వ లోక హర్త్రే

AOUA105B114



నమస్సర్వ లోక నిధయే
నమస్సర్వ లోక నిధానాయ
నమస్సర్వ లోక హితాయ
నమస్సర్వ లోక హితకరాయ
నమస్సర్వ లోకోద్భవాయ
నమస్సర్వ లోకోద్భవకరాయ
నమోవిష్ణవే, ప్రభవిష్ణవే

సర్వస్యచాహం హృది సన్నివిష్టో
మత్తస్స్మృతిర్జ్ఞాన మపోహనంచ
వేదైశ్చ సర్వై రహమేవవేద్యో
వేదాంత కృద్వేద విదేవ చాహం
మన్మనాభావ, మద్భక్తో మద్యాజీమాం సమస్కురు
మామేవై ష్యసి యుక్త్వైవం ఆత్మానం మత్పరాయణః

ఓం తత్సత్

శ్రీ కృష్ణానందాశ్రమ గీతాప్రచార సంఘం

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B114 |
| పుస్తకం పేరు | శ్రీమద్భగవద్గీత మానవకర్తవ్యము02 |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | సరి |
| వెనుక అట్ట | సరి |
| మొత్తం పేజీలు | |
| పెద్ద సైజు పేజీలు | |
| ఖాళీ పేజీలు | |
| లేని పేజీలు | |
| తయారు చేసినది | kethuna |
| పేజీలు విడదీసినది | kethuna |
| స్కాన్ చేసినది | Teja |
| పరీక్ష చేసినది | BUJJI |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |